గుంతల మార్గం.. అవస్థల ప్రయాణం


సుంకరపాలెంలో పెద్ద పెద్ద గుంతలతో ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు కీలకమైన ఆర్‌అండ్‌బీ మార్గమది. తాళ్లరేవు మండలం సుంకరపాలెం-ఇంజరం వరకు భారీ గుంతలతో నరకం చూపిస్తోంది. యానాం నుంచి రామచంద్రపురం వెళ్లే వాహనాలు ఇటుగానే ప్రయాణం సాగించాలి. ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు తయారుచేశామని ఆర్‌అండ్‌బీ జేఈ లక్ష్మీప్రసన్న తెలిపారు.
–న్యూస్‌టుడే, తాళ్లరేవు

కిట్టయ్యా.. ఈ అవస్థలు చూడయ్యా

ఈ పచ్చదనాన్ని చూసి ఇదేదో అందమైన మైదానం అనుకోనేరు. సామర్లకోట మండలం మాధవపట్నం చెరువు దుస్థితి ఇది..గత ప్రభుత్వం చేపట్టిన చెరువు ఆధునికీకరణ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి.. ప్రస్తుతం గుర్రపు డెక్క, వ్యర్థాలతో విస్తరించి ఉంది. కాళియుడి పడగపై కృష్ణుడు నృత్యం చేస్తున్నట్లుగా ఉన్న విగ్రహం కూడా తన శోభను కోల్పోతోంది. మరో వైపు వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపారు.
–ఈనాడు, కాకినాడ



వనం వదిలి జనారణ్యంలోకి..



- కడియం గోదావరి లంకల్లోకి చిరుత
- తాజాగా బుర్రిలంకలో అడుగుజాడలు
- గాలింపు చర్యల్లో అటవీశాఖ



దివాన్ చెరువు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కడియం: దాదాపు పదిహేనురోజులపాటు రాజమహేంద్రవరం సమీప దివాన్‌చెరువు అభయారణ్యంలో సంచరించిన చిరుత పులి తాజాగా కడియం, గోదావరి లంకల్లోకి ప్రవేశించింది. దీంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. అటవీశాఖ అధికారులు ఎక్కడికక్కడ అప్రమత్తమవుతూ ప్రజలకు సూచనలు జారీచేస్తున్నారు. దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో కొన్నాళ్లగా తిరుగుతున్న చిరుత జాడ మూడురోజులుగా కనిపించకపోగా మంగళవారం రాత్రి కడియం మండలంలోని దోసాలమ్మ కాలనీలో ప్రత్యక్షమైంది. బుధవారం సాయంత్రం బుర్రిలంకలోని తిరుమలశెట్టి భాస్కరరావు నర్సరీ నుంచి చెక్కపల్లి పుల్లయ్య నర్సరీ వైపు వెళ్లే మార్గంలో పాదముద్రలు గుర్తించారు. సుమారు 2 కి.మీ మేర ప్రయాణం చేసినట్లు అటవీ అధికారులు గుర్తించారు. దివాన్‌చెరువు నుంచి కడియం వరకు నేరుగా అయితే సుమారు 13 కి.మీ, వేర్వేరు మార్గాల్లో అయితే దాదాపు 30 కి.మీ మేర ఇది పయనం చేసి ఉండవచ్చని అంచనాకు వస్తున్నారు.

కనిపిస్తే సమాచారం ఇవ్వండి

కడియపులంక చుట్టుపక్కల సమీప గ్రామాల్లో చిరుత ఆనవాళ్లు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని అటవీశాఖ అధికారులు కోరారు. వివరాలకు టోల్‌ఫ్రీ నంబరు 18004255909, అటవీశాఖ క్షేత్రాధికారి 9849156162, మానిటరింగ్ టీమ్ 9705909066 నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.


చిరుతను పట్టుకునేందుకు తెచ్చిన ప్రత్యేక బోను

వరదలకు వచ్చిందా..

ఇటీవల వరదలకు గోదావరి పరివాహక ప్రాంతాల నుంచి దివాన్‌చెరువు వైపు చిరుత వచ్చిందన్న అభిప్రాయం ఉంది. బుర్రిలంక శివారులోని లంక ప్రాంతాల్లో జింకలు ఉన్నందున అటువైపు వెళ్లేందుకు ఎక్కువ అవకాశం ఉందని డీఎఫ్‌వో భరణి చెబుతున్నారు. ఇప్పటికే గ్రామస్థులకు అవగాహన కల్పించామన్నారు. గురువారానికి ఓ స్పష్టత వస్తుందని.. ఉన్నతాధికారులతో చర్చిస్తూ తగిన నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా సామాజిక మాధ్యమాల్లో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిని పోలీసులకు అప్పగిస్తామని హెచ్చరించారు.

కూలీల్లో ఆందోళన..

వర్షాకాలంలో మొక్కల ఎగుమతులు, దిగుమతులతో నిత్యం రద్దీగా ఉండే కడియపులంకలో ఒక్కసారిగా నిర్మానుష్యం అలుముకుంది. నర్సరీల మధ్యగా చిరుత సంచారం నేపథ్యంలో కూలీలు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా మనిషి నిల్చొని ఉంటే చిరుత దాడి చేయదని, కూర్చొని ఉంటే జంతువుగా భావించి లంఘించే ప్రమాదం ఉందన్నది అధికారుల మాట. దాదాపు 4వేల ఎకరాల్లో ఉన్న నర్సరీల్లో 30 వేలమందికి పైగా కూలీలు, కార్మికులున్నారు. రెండ్రోజులుగా ఎగుమతులు నిలిచిపోయాయని వాపోతున్నారు. పులి సంచారంతో కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట ప్రాంతాల్లోని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.


విధుల్లో అటవీ అధికారులు, సిబ్బంది

25 కెమెరాల ఏర్పాటు..

దివాన్ చెరువు అటవీ ప్రాంతంలో చిరుత ఇన్నాళ్లూ ఒక కి.మీ పరిధిలో వలయాకారంలో సంచరించడంతో వివిధ ప్రాంతాల్లో దాదాపు 100 ట్రాప్ కెమెరాలను అమర్చి పరిశీలిస్తూ వచ్చారు. ఇప్పుడు చిరుత దిశ మార్చడంతో కెమెరాల ఏర్పాటు విషయంలో ఓ అంచనాకు రాలేకపోతున్నారు. అది సంచరిస్తున్న ప్రాంతాల్లో 20 ట్రాప్ కెమెరాలు, 5 సీసీ కెమెరాలు బిగించారు. ఎరలు సైతం ఏర్పాటు చేశారు. కడియం నర్సరీ సంఘాలతో సమావేశమై వారి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించి జాడ కనిపిస్తే వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. ప్రస్తుతం 5 బృందాలు పని చేస్తున్నాయి.



బుర్రిలంక

సామాజిక స్థలం స్వాహాకు కుట్ర

- వైకాపా నేత కన్నబాబు ఆధీనంలో ఏళ్లుగా కొంత స్థలం
- తాజాగా తొలగిన తాత్కాలిక నిర్మాణాలు..
- ఈ భూమి తనదంటూ కోర్టును ఆశ్రయించిన మరో వ్యక్తి


కాకినాడలోని కన్నబాబు నివాసం ఎదుట సామాజిక స్థలంలో కార్యకర్తల కోసం ఏర్పాటుచేసిన పందిరి, పాక (పాత చిత్రం)

ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్: అది రూ.కోట్ల విలువైన స్థలం.. కాలనీల నిర్మాణ క్రమంలో సామాజిక అవసరాలకు విడిచిపెట్టారు. ఇందులో కొంత భాగం పదిహేనేళ్లుగా ఓ రాజకీయ నేత ఆధీనంలో ఉంది. అంతే కార్పొరేషన్ అధికారులు ఆ జోలికి వెళ్లలేదు. ఇటీవల అధికారం పోయాక కబ్జా బాగోతంపై చర్చ నడిచింది. ఆక్రమణలు తొలగించాలన్న ఒత్తిడి పెరిగింది. దీంతో ఆ నేతే స్వచ్ఛందంగా తాత్కాలిక నిర్మాణాలు తొలగించుకున్నారు. ఇంతటితో కబ్జా కథ ముగిసిపోలేదు..

చెర వీడిన భూములతోపాటు, మిగిలిన స్థలం చుట్టూ రక్షణ కంచె వేయకుండా అధికారులు జాప్యం చేశారు. అంతే ఈ స్థలంతోపాటు అక్కడ ఖాళీగా ఉన్న మరికొంత స్థలం తనదేనంటూ.. ఓ వ్యక్తి తెరమీదికి వచ్చారు. లేని సర్వే నంబరు ఉన్నట్లు పేర్కొంటూ రిజిస్ట్రేషన్ పత్రాలతో న్యాయపరమైన ఆంక్షలు తెరమీదికి తెచ్చారు.. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ భూమేనని, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకుని వివాదం సృష్టించారని అధికారులు అంటున్నారు. రూ.కోట్ల విలువైన భూమిని కొట్టేయడానికి ఇలా పన్నాగం పన్నారనే చర్చ నడుస్తోంది.

ఇదీ అసలు కథ..

కాకినాడ నగరపాలక సంస్థ పరిధి రెండో డివిజన్‌లో రూ.30కోట్ల విలువైన మున్సిపల్ ఓపెన్ స్పేస్ 1.20 ఎకరాల్లో ఉంది. సర్వే నంబర్లు 103/2, 103/3, 104/5, 105/1లలో ఎల్‌పీ నంబర్లు 81/79, 490/81, 41/82, 313/82, 519/82తో అయిదు లేఅవుట్లు వేశారు. వీటిద్వారా వచ్చిన సామాజిక స్థలాన్ని అనుసంధానం చేసి ఎల్‌పీ నంబరు 392/85తో రివైజ్డ్ లేఅవుట్ ద్వారా ఖాళీ స్థలాన్ని (ఓపెన్ స్పేస్)ను 1985లో కాకినాడ పురపాలక సంఘానికి బదలాయించారు. రమణయ్యపేట ప్రాంతంలోని వైద్యనగరేలో ఉన్న ఈ స్థలంలో పార్కు ఏర్పాటుచేయాల్సి ఉన్నా కార్యరూపం దాల్చలేదు. కనీసం స్థలం చుట్టూ రక్షణ గోడ, కంచె లేవు. అంతే కబ్జా చేసే పరిస్థితులు ఎదురయ్యాయి.

ఏ హక్కుతో పాగా వేశారు కన్నా..?

వైకాపా మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు 2009 నుంచి వైద్యనగర్‌లో నివసిస్తున్నారు. ఆయన ఇంటి ముందున్నది ఈ వివాదాస్పద సామాజిక స్థలమే. అనధికారికంగా తాటాకు పందిరి, షెడ్లు వేసి కార్యకర్తల సమావేశాలు, వాహనాల పార్కింగ్‌కు వాడేవారు. 2019- 24 మధ్య వైకాపా ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడే కబ్జా వ్యవహారం వెలుగులోకి వచ్చినా.. కొందరు కార్పొరేషన్ అధికారులు ఆ జోలికి వెళ్లలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక డొంక కదలింది. ఈ స్థలం పరిరక్షణకు సిద్ధమవ్వడంతో స్వచ్ఛందంగా ఆయనే షెడ్లు తొలగించుకున్నారు. చుట్టూ రక్షణ కంచె వేయాలని ఈ ఏడాది ఆగస్టు 6న ఇంజినీరింగ్ విభాగానికి పట్టణ ప్రణాళిక అధికారులు లేఖ రాసినా స్పందనలేదు.


ఆక్రమణల వ్యవహారం వివాదాస్పదం కావడంతో పాకలు తొలగించగా ఖాళీ అయిన స్థలం

బరితెగింపు వెనుక..

సామాజిక స్థలం 5,760 గజాల్లో ఉంటే.. కొంత భాగం తనదేనంటూ విశాఖకు చెందిన ఓ వ్యక్తి రంగంలోకి దిగారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించి, వాటి ఆధారంగా కోర్టు దావా వేసి స్టేటస్‌కో తెచ్చుకున్నారు. దీని వెనుక రాజకీయం చక్రం తిప్పిందని, పక్కా వ్యూహంతోనే వ్యవహారం సాగిందనే ప్రచారం సాగుతోంది. వైకాపా అనుకూల అధికారులు కొందరు ఇప్పటికీ ఇక్కడే ఉండడంతో లోపాయికారీ సహకారం అందించారనే ఆరోపణలు ఉన్నాయి.

తప్పుడు పత్రాలు సృష్టించారు..

కాకినాడ వైద్యనగర్‌లోని రివైజ్డ్ లేఅవుట్ ఎల్‌పీ నంబరు 392/85లోని 1.20 ఎకరాల స్థలం నగరపాలక సంస్థకు చెందినది. దీనిలో మూడు ప్లాట్లు.. ఒక్కోటి 325 గజాల చొప్పున.. 975 గజాల స్థలం తన తండ్రి పూర్వార్జితమని, ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయవద్దని కోర్టు నుంచి ఓ వ్యక్తి స్టేటస్‌కో తెచ్చారు. కోర్టుకు సమర్పించిన ఆధారాల్లో ఎల్‌పీ నంబర్ 313/82లో సర్వే నంబర్ 101/1 అని పేర్కొన్నారు. ఈ స్థలంలోని అయిదు ఎల్‌పీ నంబర్లలో అది లేనే లేదు. తప్పుడు పత్రాలతో సామర్లకోట సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో 975 గజాల స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వాస్తవాలను ఆధారాలతో సహా న్యాయస్థానం ముందు ఉంచి కౌంటర్ దాఖలు చేస్తాం. ప్రభుత్వ స్థలాన్ని కాపాడుతాం.
- కె.హరిదాసు, డిప్యూటీ సిటీ ప్లానర్, కాకినాడ నగరపాలక సంస్థ

ఇటు సేవలు భారం.. అటు దుబారా

నగర పాలక సంస్థలో పరిస్థితి

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ఒకవైపు.. నగరంలో వెలగని వీధి దీపాలు. మరమ్మతులకు గురైన రహదారులు. 15 రోజులుగా నిలిచిన ఇంటింటా చెత్త సేకరణ వాహనాలు. చెత్తను తరలించడానికి పుష్‌కార్టులు లేని దుస్థితి.

మరోవైపు.. పౌరసేవల కల్పనకు జనం చెల్లించిన సొమ్ము దుబారా అవుతోంది. కొందరు అధికారులు ఛాంబర్ల సుందరీకరణ, విడిది కార్యాలయాలకు సొబగులు అద్దేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అర్హతకు మించి ఖరీదైన అద్దెకార్లను వినియోగిస్తూ నగరపాలక ఖజానాను మంచినీళ్లులా ఖర్చు చేస్తున్నారు.

వైకాపా పాలనలో కాకినాడ నగర పాలక సంస్థ సాధారణ నిధులను నిబంధనలకు విరుద్ధంగా వినియోగించారు. కూటమి ప్రభుత్వం వచ్చినా.. కొందరు అధికారుల్లో మార్పులేదు. ఆర్థిక సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి ప్రభుత్వ పెద్దలు ఆచితూచి అడుగులేస్తున్నారు. కొన్ని సౌకర్యాలను వదులుకుంటున్నారు. కాకినాడలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది.


మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఛాంబరు

తాత్కాలిక ఛాంబరుకు హంగులు

శౌరదాంబగుడి వద్ద ఉన్న నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఛాంబరును రూ.9 లక్షలతో ఆధునికీకరిస్తున్నారు. రెండున్నరేళ్ల కిందట అప్పటి కమిషనర్, ఐఏఎస్ అధికారి స్వప్నిల్ దినకర్ హయాంలో ఈ ఛాంబరును హంగులతో తీర్చిదిద్దారు. తర్వాత వచ్చిన ఐఏఎస్ అధికారి మహేశ్ కుమార్ ఇక్కడే విధులు నిర్వహించారు. ఇటీవల వచ్చిన ఐఏఎస్ అధికారిణి భావనకు ఈ ఛాంబరు నచ్చలేదు. టైల్స్, కబోర్డులు, ఇతర సామగ్రి తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయిస్తున్నారు. త్వరలో కొత్త కార్యాలయానికి వెళ్లనుండగా ఇప్పుడు ఆధునికీకరణ ఎందుకని కొందరు ప్రశ్నిస్తున్నారు. కమిషనర్ బంగ్లాలో ఫౌంటెన్‌కు సుమారు రూ.లక్షతో హంగులు అద్దుతున్నారు. అక్కడ కొన్ని సివిల్ పనులు చేయిస్తున్నారు. హార్డ్‌వేర్ పరికరాలకు సంబంధించి సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. కార్పొరేషన్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా ఇప్పుడు ఇలాంటి పనులు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కారు ప్రైవేటు.. డ్రైవర్ మున్సిపల్ కార్మికుడు

నగరపాలక సంస్థలో అధికారులకు ప్రైవేటు సంస్థల ద్వారా అద్దె కార్లను సమకూరుస్తున్నారు. కారుతో పాటు డ్రైవర్‌ను ఆ సంస్థే పంపించాలి. అధికారి క్యాడర్ ఆధారంగా నెలకు రూ.35వేలు, రూ.45వేల చొప్పున కార్పొరేషన్ అద్దె చెల్లిస్తోంది. కీలక అధికారుల కార్లకు మున్సిపల్ పొరుగు సేవల సిబ్బందినే డ్రైవర్లుగా వినియోగిస్తున్నారు. వీరికి కార్పొరేషన్ ద్వారా వేతనం ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డ్రైవర్‌ను మినహాయించి కారుకు మాత్రమే అద్దె చెల్లించాలి. ఇక్కడ అలా జరగడం లేదు. ఆ ప్రైవేటు సంస్థకు ఇచ్చే అద్దెలో డ్రైవర్ జీతాన్ని అధికారులే నొక్కేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు సొంత కార్లను వినియోగిస్తూ నగరపాలక సంస్థ నుంచి అద్దె తీసుకుంటున్నారు. వీరూ పురపాలక పొరుగు సేవల సిబ్బందినే డ్రైవర్గా వినియోగించుకుంటున్నారు. నగరపాలక సంస్థలో 22 అద్దెకార్లు ఉండగా, వీటిలో 50 శాతం అధికారుల సొంత కార్లే ఉన్నట్లు సమాచారం.

పాడైపోవడంతోనే మరమ్మతులు

కమిషనర్ ఛాంబరు పాడైపోవడంతో మరమ్మతులు చేస్తున్నాం. తక్కువ మొత్తంలోనే వెచ్చించాం. కమిషనర్ బంగ్లాలోనూ కొన్ని పనులు చేయిస్తున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ పనులు చేపట్టాం. -పి.సత్యకుమారి, ఎస్ఈ, కాకినాడ నగరపాలక సంస్థ

విభిన్న ప్రతిభావంతులకు ఆన్‌లైన్ శిక్షణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వికాస ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ ఏడీ(ఇన్‌ఛార్జి) పి.నారాయణమూర్తి, సార్థక్ సంస్థ ప్రతినిధి కిషోర్, వికాస పీడీ కె.లచ్చారావుతో సమీక్షించారు. సార్థక్ సంస్థ ద్వారా శిక్షణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటర్, డిగ్రీ, బి.టెక్ ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులకు 45 నుంచి 60 రోజులు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. శిక్షణ అనంతరం టెక్ మహేంద్ర, టీసీఎస్, ఇన్ఫోసిస్, రిలయన్స్, అసెంచర్ వంటి సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. అర్హులు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్తుశాఖ కాకినాడ సర్కిల్ ఏర్పాటు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) కాకినాడ జిల్లాకు కొత్తగా విద్యుత్తు సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్నాళ్లూ ఉమ్మడి జిల్లాకు రాజమహేంద్రవరంలో సర్కిల్ కార్యాలయం ఉండేది. కాకినాడ సర్కిల్ ఎస్ఈగా విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న జి.ప్రసాద్‌ను నియమించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(ఈఈ-టెక్నికల్)గా ఉషారాణి, ఈఈ-కనస్ట్రక్షన్స్‌గా జగదీశ్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఆదినారాయణమూర్తిని నియమించారు. ఆరుగురు డీఈఈలు, 12 మంది ఏఈఈ/ఏఈలు, నలుగురు జేఈలు, ఒక ఏఏవో, ముగ్గురు జేఏవోలు, ఒక డీజీఎం/పీవో, 11 మంది సీనియర్ అసిస్టెంట్లు, 9 మంది జూనియర్ అసిస్టెంట్లను నియమించాల్సి ఉంది. 52 మంది అధికారులు, సిబ్బందిని కొత్త సర్కిల్ కార్యాలయానికి మంజూరు చేశారు. కాకినాడ డీఈ కార్యాలయ ప్రాంగణంలోని రెవెన్యూ విభాగంలో సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. శుక్రవారం నుంచి కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.

మళ్లీ మొదలైంది..!



గొల్లప్రోలు జగనన్న కాలనీ.. ఈ పేరు పలకగానే ఠక్కున గుర్తొచ్చేది సుద్దగడ్డ వరదనీరు.. భారీవర్షాలు, ఎగువ ప్రాంతం నుంచి ప్రవాహం మొదలైతే చాలు.. ఇక్కడ ఉద్ధృతి పెరగడం, కాలనీ వాసులు అష్టకష్టాలు పడుతూ వాగు దాటాల్సి రావడం పరిపాటైంది. ఈ ఏడాదిలో ఇప్పటికి నాలుగుసార్లు కాలనీ మార్గం ముంపునకు గురికాగా.. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. బుధవారం కూడా అదే దృశ్యం మరోమారు పునరావృతమైంది. కాలనీకి వెళ్లే మార్గంలో వెంటనే వంతెన నిర్మించాలని, పుంత రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సకాలంలో ఇసుక పంపిణీ: కలెక్టర్

కాకినాడ కలెక్టరేట్: ఉచిత ఇసుక కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారందరికీ వాహనాలు కేటాయించి సకాలంలో పంపిణీ చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం గనులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్‌కుమార్‌మీనా అమరావతి నుంచి కలెక్టర్లు, జేసీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా అధికారులు హాజరయ్యారు. ఉచిత ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ అమలుపై సమీక్షించారు. జిల్లాలో పరిస్థితిని కలెక్టర్ వివరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని జిల్లాలో అత్యంత పారదర్శకంగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో గనుల శాఖ ఉప సంచాలకుడు ఇ.నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.9.28 కోట్లు విడుదల

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలో భారీ వర్షాలు, వరద కారణంగా ఆస్తులు నష్టపోయిన 9,284 కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రూ.9,28,40,000 ఆర్థిక సాయాన్ని విడుదల చేసింది. పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న గృహాలు, మూడు రోజులకు పైగా నీటి మునిగిన ఇళ్లకు సంబంధించి ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున మంజూరు చేశారు. జిల్లాలోని తొండంగిలో 686, శంఖవరంలో 19, రౌతులపూడిలో 5, ప్రత్తిపాడులో 58, పెద్దాపురంలో 109, గండేపల్లిలో 14, ఏలేశ్వరంలో 8, తునిలో 25, కిర్లంపూడిలో 3,371, పెదపూడిలో 121, కాకినాడ గ్రామీణంలో 5, యు.కొత్తపల్లిలో 1,109, సామర్లకోటలో 117, కరపలో ఒకటి, గొల్లప్రోలులో 2,071, పిఠాపురంలో 1,565 కుటుంబాలకు ఈ సాయాన్ని అందించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి పెట్టుబడి రాయితీ ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేస్తారని అధికారులు చెబుతున్నారు. ఎకరానికి రూ.10వేలు చొప్పున పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గురువారం రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేస్తారని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

బాధితుల హర్షం

గొల్లప్రోలు: వరద బాధితుల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేల చొప్పున సొమ్ము జమ కావడంతో హర్షం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో రూ.2.07కోట్లు విడుదల చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటానికి గొల్లప్రోలు ఎస్సీపేటలో ప్రజలు క్షీరాభిషేకం చేశారు.


గొల్లప్రోలు ఎస్సీపేటలో పవన్‌కల్యాణ్ చిత్రానికి పాలాభిషేకం చేస్తున్న ప్రజలు


చర్చిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, చిత్రంలో శిక్షణ కలెక్టర్ భావన

పిల్లల భద్రత అందరి బాధ్యత

కాకినాడ కలెక్టరేట్: పిల్లల భద్రత, రక్షణ అందరి బాధ్యతని కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పడాల ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలులో ఉన్న స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్(ఎస్ఎఫ్ఎల్‌బీ) కార్యక్రమంపై చర్చించారు. దీనిని వచ్చేనెల నుంచి మరింత విస్తృతం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాను లైంగిక వేధింపుల రహితంగా మార్చేందుకు సమష్టిగా పని చేస్తామన్నారు. 2 నుంచి ఏడో తరగతి వరకు చదివే పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ హెచ్ఎస్ భావన, పడాల ఛారిటబుల్ ట్రస్టు సీఈవో సూర్యప్రసాద్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పని చేయాలి: కలెక్టర్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ షాన్‌మోహన్‌ను బుధవారం కలెక్టరేట్‌లో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిశారు. జిల్లాలో రెవెన్యూ శాఖతో పాటు అన్ని శాఖల్లో పారదర్శకంగా బదిలీ ప్రక్రియ పూర్తి చేసినందుకు, విపత్తులు సమర్థంగా ఎదుర్కొని, ప్రాణ నష్టం లేకుండా చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఉద్యోగులు అన్నివిధాల అండగా ఉంటామన్నారు. ఏపీఆర్ఎస్ఏ ప్రతినిధులు ఎస్.రామ్మోహన్, రాజు, ఎ.వి.దినపావరావు, ఎం.రామకృష్ణ, సంధ్య, దీపిక, యమున తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ షాన్‌మోహన్‌ను అభినందిస్తున్న ఏపీఆర్ఎస్ఏ ప్రతినిధులు

1,493 మహిళా సంఘాలకు రూ.17.21 కోట్ల రుణాలు

మెప్మా పీడీ ప్రియంవద

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లాలోని పట్టణాల్లో ఇంతవరకూ 1,493 మహిళా శక్తి సంఘాలకు రూ.17.21 కోట్ల రుణాలను అందించినట్లు పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) పీడీ ప్రియంవద తెలిపారు. గొల్లప్రోలులో బుధవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. ప్రస్తుత సంవత్సరంలో 1,800 సంఘాలకు రూ.72 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం నిర్ణయించినట్లు చెప్పారు. కాకినాడ జిల్లాలో పీఎం స్వనిధి 32,018 మందికి అందించాలని లక్ష్యం కాగా ఇంతవరకూ 31,950 మందికి మంజూరు చేసినట్లు వివరించారు. అర్హులైన మహిళా సంఘాలన్నింటికీ బ్యాంకు రుణాలు సత్వరం మంజూరు చేస్తున్నట్లు వివరించారు. గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు మహిళా సంఘాల్లో ఉన్న వారికి అవసరమైన మేర బ్యాంకు రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత నెలలో పౌష్టికాహార ప్రాధాన్యతను వివరిస్తూ మహిళలకు అవగాహన కల్పించేలా మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

చిరుత కదలికలపై మంత్రి దుర్గేష్ ఆరా

కడియం: కడియంలోని నర్సరీల పరిసరాల్లో చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో స్థానికులు, అధికారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. బుధవారం కడియం విచ్చేసిన మంత్రి అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. చిరుత పాదముద్రలు లభించిన కారణంగా ఇతరత్రా చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, రక్షణ, భద్రతా ఏర్పాట్లపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చిరుత కదలికలపై ఇప్పటికే నిఘా ఉంచామన్నారు. కడియం పరిసర ప్రాంతాలను పూర్తిగా జల్లెడపడుతున్నామని, క్రూరమృగాన్ని పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలోనే పట్టుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలు ఆందోళన చెందవద్దని, అధికారులు అండగా ఉంటారని మంత్రి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ముద్రగడ జెమీ, వెలుగుబంటి రఘురామ్, చెక్కపల్లి మురళీకృష్ణ, ఆదిమూలం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

వైకాపాను వీడేది లేదు: దాడిశెట్టి రాజా

తుని, న్యూస్‌టుడే: తాను వైకాపాను వీడేది లేదని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా స్పష్టం చేశారు. గత కొద్ది రోజులుగా తాను వైకాపాకు రాజీనామా చేసి జనసేనలో చేరుతున్నట్లు పలు పత్రికలు, మీడియాలో వస్తున్న వార్తలను నమ్మవద్దన్నారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఉండి పరీక్షలు చేయించుకుంటున్నానని, అక్కడి నుంచి వచ్చిన వెంటనే పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుస్తానన్నారు. ఈమేరకు ఆయన కార్యాలయం నుంచి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-50 పైII అనపర్తి ఆఫీసు: 08857-226908

వరద వదిలింది.. పొలం పోయింది..!

పిఠాపురంలో రైతుల దీనావస్థ

ఏలేరు వరద రైతుల కన్నీరు మిగిల్చింది. నెల రోజుల్లో పంట చేతికి వస్తుందని ఆశతో ఉన్న అన్నదాతను దారుణంగా దెబ్బతీసింది. వరద తగ్గిన తర్వాత మేట వేసిన ఇసుక, మట్టితో పొలం కనుమరుగైంది. నష్టపోయిన పంట సంగతి ఎలా ఉన్నా పొలంలోని ఇసుక, మట్టిని తొలగించుకోవడం ప్రస్తుతం గుదిబండగా మారింది. అధికారిక అంచనా ప్రకారం కాకినాడ జిల్లాలో 62,505 ఎకరాల్లో వరి పంట పూర్తిగా నష్టపోయింది. మొలకలొచ్చిన పంటపై ఇసుక, మట్టి మేటలు వేశాయి. పిఠాపురం మండలం వీరరాఘవ పురం, రాపర్తి గ్రామాల్లో దాదాపు 50 ఎకరాల్లో మేటలు ఏర్పడ్డాయి. పంట నష్టంతో పాటు మేటల తొలగింపునకు ఎకరాకి రూ.50 వేల వరకు ఖర్చవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- ఈనాడు, కాకినాడ



మేటలు తొలగించడమే కష్టం..

ఈ రైతు పేరు మురుకుర్తి సూరిబాబు. పిఠాపురం మండలం రాపర్తికి చెందిన ఇతను మూడెకరాలు కౌలుకు తీసుకొని వరిసాగు చేశారు. ఇప్పటివరకు రూ.75 వేలు పెట్టుబడిగా ఖర్చయింది. వరదతో పంట మొత్తం తుడిచిపెట్టుకుపోగా ప్రస్తుతం పొలంలో ఇసుక, బురద మేట వేసింది.

ఆరెకరాల్లో నష్టం..



ఈయన పేరు గోవిందరాజులు. పిఠాపురం మండలం వీరరాఘవపురంలో ఆరెకరాల్లో వరి సాగుచేస్తున్నారు. వరదలో పంట కొట్టుకుపోగా రెండడుగుల మేర ఇసుక, బురద మిగిలింది. ఇప్పటికే పంట సాగుకు రూ.1.50 లక్షలు ఖర్చుచేశారు. పొలంలో మేటలు తొలగించడం తలకు మించిన భారమని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో..



ఈ రైతు పేరు ముప్పిడి కొండారెడ్డి. పిఠాపురంలోని రాపర్తిలో ఎకరా పొలాన్ని కౌలుకు తీసుకుని వరి సాగుచేశారు. వరదలో పంట నష్టపోగా ప్రస్తుతం ఇసుక, బురద మిగిలిందని దిక్కుతోచని స్థితిలో చిక్కుకొన్నారు.

ఈపీఎఫ్‌వో 'నిధి ఆప్‌కే నికత్' రేపు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఆయా జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికత్' శిబిరాలు ఈ నెల 27న నిర్వహించనున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ వై.డి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి రాజానగరంలోని లెనోరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ వద్ద జరుగుతుందన్నారు. కోనసీమ జిల్లాకు సంబంధించి ముమ్మిడివరంలోని పీసీపీఎస్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి వై.రామవరం మండలం పి.యర్రగొండ ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, గంగవరం మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాల, మారేడుమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. ఆయా జిల్లాల పరిధిలోని పీఎఫ్ ఖాతాదారులు, పింఛనుదారులతో పాటు ఎస్టాబ్లిష్‌మెంట్లు పాల్గొని ఫిర్యాదులు అందించవచ్చని, పింఛనుదారులు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించవచ్చని సహాయ పీఎఫ్ కమిషనర్ పేర్కొన్నారు.

శిరస్త్రాణం ధరించడం చోదకుల బాధ్యత

దానవాయిపేట(రాజమహేంద్రవరం): శిరస్త్రాణం ధరించడంతో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టాన్ని తగ్గించే అవకాశాలు ఉన్నాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరం జిల్లాకోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నివారణ, శిరస్త్రాణం ఆవశ్యకతపై ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడపడం ప్రమాదకరంతో పాటు చట్టరీత్యా నేరమన్నారు. అతివేగం ప్రమాదమని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. శిరస్త్రాణం అనేది తలపై బరువుగా భావించకుండా బాధ్యతగా భావించాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో సమకూర్చిన శిరస్త్రాణాలను పంపిణీ చేశారు. ఈ సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు, డిప్యూటీ రీజనల్ హెడ్ డి.రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత తదితరులు

వరద బాధితులకు రూ.10 లక్షల సహాయం

చెక్కును అందించిన శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్

తుని, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం శ్రీప్రకాష్ విద్యాసంస్థల తరపున రూ.10 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. ఈ చెక్కును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన క్యాంపు కార్యాలయంలో విద్యాసంస్థల డైరెక్టర్ చిట్టూరి విజయ్‌ప్రకాష్ మంగళవారం రాత్రి అందజేశారు. వరదల్లో తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు తమవంతు బాధ్యతగా ఈ విరాళాన్ని ఇచ్చినట్లు విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్‌వికె నరసింహారావు తెలిపారు.



ఉప ముఖ్యమంత్రి పవన్‌కు చెక్కు అందిస్తున్న విజయ్‌ప్రకాష్

శిశువు తలకు అరుదైన శస్త్రచికిత్స

మసీదుసెంటర్(కాకినాడ): నెలన్నర వయసు శిశువుకు కాకినాడ జీజీహెచ్‌లో న్యూరోసర్జరీ వైద్యనిపుణులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఆ వివరాలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి బుధవారం తెలిపారు. బిక్కవోలుకు చెందిన కామేశ్వరరావు, గంగా దంపతుల నెలన్నర మగ బిడ్డకు తలలో ట్రైగోనోసెఫాలీ అనే సమస్య ఏర్పడింది. తల ఎముకలు నిర్ణీత కాలానికి ముందుగానే కలిసిపోవడంతో ఇబ్బంది ఎదురైంది. ఈ వ్యాధి కారణంగా శిశువు మెదడు ఎదిగేందుకు ఖాళీ లేకపోవడంతో పాటు తల వంకరగా మారింది. ఇటీవల జీజీహెచ్ న్యూరోసర్జరీ వైద్యులకు చూపించారు. న్యూరోసర్జరీ విభాగాధిపతి డా.విజయశేఖర్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కలకోటి చంద్రశేఖర్‌రెడ్డి, డా.కార్తీక్ గతవారం శస్త్రచికిత్స నిర్వహించి ఆ లోపాన్ని సరిదిద్దారు. శిశువు కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జి చేశారు. నెలన్నర వయసు, 1.7 కేజీల బరువు ఉండే శిశువుకు జీజీహెచ్‌లో ఇలాంటి శస్త్రచికిత్స చేయడం ఇదే తొలిసారని సూపరింటెండెంట్ తెలిపారు.



శిశువుతో వైద్యబృందం, శస్త్ర చికిత్సకు ముందు, తరువాత స్కానింగ్ చిత్రాలు

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా కృష్ణకుమారి

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఈఎస్)గా ఎం.కృష్ణకుమారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె గతంలో విశాఖపట్నంలో ఎస్ఈబీ సూపరింటెండెంట్‌గా పని చేశారు. సెబ్‌ను రద్దు చేసిన నేపథ్యంలో పోస్టింగ్ కోసం వేచి చూస్తుండగా కాకినాడ ఈఎస్‌గా వచ్చారు. సామర్లకోట డిపో మేనేజర్, జిల్లా ఇన్‌ఛార్జి ఈఎస్‌గా పనిచేసిన ఎస్‌కేవీడీ ప్రసాద్ బదిలీపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి బదిలీపై వెళ్లారు. బుధవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎం.కృష్ణకుమారి బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా దీపిక



సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా ఎం.దీపికను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అనకాపల్లి జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న దీపికను కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆమె భర్త విక్రాంత్‌పాటిల్ కాకినాడ జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు.

రిలయన్స్ క్విజ్ పోటీలు డిసెంబరు 5న

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కేజీడీ-6 కాకినాడ ఆధ్వర్యంలో రిలయన్స్ ధీరూభాయ్ అంబాని క్విజ్ పోటీలు డిసెంబరు 5న రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్నట్లు డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని, జట్టుకు ఇద్దరు చొప్పున ప్రతి పాఠశాల నుంచి రెండు జట్లు పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ కనకరాజు, సీఎంవో శ్రీనివాసరావు, రిలయన్స్ సీఎస్ఆర్ ప్రతినిధి పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 0884-3577222లో సంప్రదించవచ్చన్నారు.

కమిషనర్ - డీఈ బాహాబాహీపై విచారణకు ఆదేశం

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పురపాలక సంఘ సమావేశంలో ఆగస్టు 31న కమిషనర్ ఎన్.కనకారావు, డీఈ ఎస్.భవానీ శంకర్ బాహాబాహీకి దిగడం తెలిసిందే. కౌన్సిల్ సమావేశంలో వారిద్దరూ తిట్టుకుని, కొట్టుకున్న ఆ ఘటనపై చర్యల్లో భాగంగా అదే రోజు రాత్రి డీఈని సస్పెండ్ చేస్తూ ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీ ఆర్.గోపాలకృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలోనే తాజాగా సదరు వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు పి.పూర్ణచంద్రరావు (ఏడీఎం), ఎం.బ్రహ్మజీ (ఎస్ఈ), బి.శ్రీనివాసులు (అడిషనల్ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్) ముగ్గురితో బుధవారం ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. విచారణ చేపట్టి 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు బుధవారం కొనసాగాయి. ఈ నెల 23న ప్రారంభమైన ఈ పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. బుధవారం 108 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు జీన్ టాల్బర్ట్ ఫాకోగ్, డా.సమత కడియాల, ఇతర వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించారు.



హాజరైన మహిళలు

కాకినాడలో.. 6 రాష్ట్రాల ఫోరెన్సిక్ నిపుణులు

మూడు రోజుల పాటు సదస్సు

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ (ఎస్ఐఎంఎల్ఏ) 20వ వార్షిక కాన్ఫరెన్స్-2024 కాకినాడలో నిర్వహిస్తున్నారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) ఆడిటోరియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, గోవా నుంచి సుమారు 500 మందికి పైగా ఫోరెన్సిక్ వైద్యులు, వైద్య విద్యార్థులు హాజరుకానున్నారు. ఉత్తర భారతదేశ రాష్ట్రాల నుంచీ కొంతమంది వైద్యనిపుణులు వస్తున్నారని ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డా.నరసింహం తెలిపారు.



సదస్సు నిర్వహించే ఆర్ఎంసీ ఆడిటోరియం


నేర నిర్ధారణలో ఫోరెన్సిక్ సైన్స్

నేర నిర్ధారణలో న్యాయ వ్యవస్థకు ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణులు సాంకేతికత సహకారం అందిస్తారు. ఇందులో పోస్టుమార్టం నివేదిక ప్రధానం. ఎముకల ద్వారా వయసు, లింగ నిర్ధారణ చేస్తారు. హత్య, అత్యాచారం కేసుల్లో నమూనాలను సేకరించేందుకు ఈ సైన్స్ దోహదపడుతుంది.

నిపుణుల ప్రసంగాలు

మూడు రోజుల సదస్సులో 14 మంది ఫోరెన్సిక్, లీగల్ నిపుణులు ప్రసంగిస్తారు. ఈ విభాగంలో నూతన పోకడలు, అత్యాధునిక సాంకేతికతను వివరిస్తారు. వైద్య విద్యార్థులకు క్విజ్, సైంటిఫిక్ పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు ఉంటాయి.

ఏర్పాట్లు పూర్తి...



మొదటి రోజు నిరంతర వైద్య విద్య(సీఎంఈ) జరుగుతుంది. అతిథులుగా ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.వి.రాధికారెడ్డి, డా.జి.రఘునందన్ పాల్గొంటారు. తర్వాత రెండు రోజుల సదస్సుకు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ హాజరవుతారు. సీఎంఈ, సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం.

-డా.పి.ఉమామహేశ్వరరావు, ఎస్ఐఎంఎల్ఏ ఆర్గనైజింగ్ ఛైర్మన్

500 మందికి పైగా రాక



ఈ సదస్సును తొలిసారిగా ఆర్ఎంసీలో నిర్వహిస్తున్నాం. దక్షిణాది రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా వైద్యనిపుణులు, వైద్యవిద్యార్థులు హాజరుకానున్నారు. గురువారం స్పాట్ రిజిస్ట్రేషన్ సైతం ఉంటుంది.

-డా.ఫణికిరణ్, ఎస్ఐఎంఎల్ఏ ఆర్గనైజింగ్ కార్యదర్శి

4.5 కేజీల బిడ్డకు జన్మనిచ్చిన తల్లి

గండేపల్లి(జగ్గంపేట): 4.5 కేజీల బరువు ఉన్న ఆడ శిశువుకు జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళ జన్మనిచ్చింది. బుధవారం జగ్గంపేట సీహెచ్‌సీ డా.ప్రణీత్ తెలిపిన వివరాలివీ.. జగ్గంపేట మండలం మర్రిపాకకి చెందిన అచ్చివేణి ప్రసవానికి మంగళవారం ఆసుపత్రిలో చేరారు. వైద్యులు భాగ్యలక్ష్మి, వర్మ సాధారణ ప్రసవం చేశారు. శిశువు 4.5 కేజీల బరువుతో తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు.



వైద్యులతో తల్లి, బిడ్డ

అంతర్రాష్ట్ర నేరస్థుడి అరెస్టు

400 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఒకటి కాదు.. రెండుకాదు.. ఏకంగా 44 కేసుల్లో నిందితుడు.. 14 కేసుల్లో జైలుకు వెళ్లాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జైలునుంచి విడుదలయ్యాడు. గత నెలలో భారీ చోరీచేసి తిరిగి పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర నేరస్తుడిని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ డి.నరసింహాకిశోర్ రాజమహేంద్రవరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా జగన్నాథపురం ఏటిమొగకి చెందిన పొన్నాడ రవిశంకర్ అలియాస్ వీరబాబు రాజమహేంద్రవరం ఏవీఏ రోడ్డులోని కోటభాస్కరమ్మనగర్‌లో నివాసముంటున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 22, విశాఖ పరిధిలో 16, తూర్పుగోదావరిలో 2, శ్రీకాకుళంలో 2, విజయనగరంలో ఒకటి, అనకాపల్లిలో ఒకటి మొత్తం 44 చోరీ కేసుల్లో నేరస్తుడు. గతనెల 26 రాత్రి కొవ్వూరు పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో మహమ్మద్ మహారాజ్ అపార్టుమెంట్‌లోని కట్టా ఉషశ్రీ ఫ్లాటులోకి చొరబడి సుమారు 400 గ్రాముల బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనం చోరీ చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సీఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబు, ఎస్సైలు పి.రవీంద్రబాబు, కె.జగన్మోహనరావు రెండు బృందాలుగా కేసు దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో ఇటీవల కొవ్వూరు పట్టణంలోని నిడదవోలు బస్టాపులో నిందితుడు వీరబాబు, అతడికి సహకరించిన లంకలపల్లి నాగరాజును అరెస్టు చేశారు. చోరీ సొత్తును భీమవరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నుంచి రికవరీ చేశారు. వీరబాబు చోరీచేసిన రూ.15.30 లక్షల విలువజేసే 400 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు ద్విచక్రవాహనాన్ని రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. రెండో నిందితుడైన నాగరాజు భీమవరం పట్టణంలోని పాలూరివారి వీధిలో నివాసముంటూ భీమవరం స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్, పాలకోడేరు స్టేషన్ పరిధిలో హత్యాయత్నం కేసుల్లో జైలుశిక్ష అనుభవించి గత ఏప్రిల్ నెలలో విడుదలయ్యాడన్నారు. కేసుల ఛేదనలో ప్రతిభ చూపిన పలువురు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

కుక్క స్వైరవిహారం.. పలువురికి గాయాలు

రౌతులపూడి: మండలంలోని గ్రామాల్లో బుధవారం ఓ కుక్క స్వైర్యవిహారం చేసింది. ఎం.కొత్తూరు, ములగపూడి, బలరాంపురం, ఎ.మల్లవరం గ్రామాల్లో పలువురు కుక్కకాటుకు గురయ్యారు. ములగపూడి గ్రామంలో 13 మంది కుక్కకాటు బారినపడ్డారు. ఈ ఒక్కరోజే 24 మంది కుక్క కాటుతో రౌతులపూడి సీహెచ్‌సీకి వైద్యం నిమిత్తం వచ్చారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,500
పాతకాయ: గండేరా	18,000
గటగట	15,000
కొత్తకాయ: గండేరా	17,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	17,000-18,000
కొత్త (పచ్చి) కాయ	17,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,375
కిలో	225

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	121-00
రిటైల్ లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

ఆందోళన కార్యక్రమం వాయిదా

సాంబమూర్తినగర్(కాకినాడ): అంగన్‌వాడీ కేంద్రాల్లో అదానీ వాలంటీర్ల నియామకాన్ని నిరసిస్తూ ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టవలసిన ఆందోళనను వాయిదా వేస్తున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అదానీ వాలంటీర్ల నియామకాన్ని ఉపసంహరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారని ఐసీడీఎస్ పీడీ చెప్పడంతో యూనియన్ తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై రాత పూర్వకంగా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

హెచ్ఎం వేధింపులపై విచారణ

పిల్లల నుంచి వివరాల సేకరణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధి గొడారిగుంటలోని మదర్ థెరిసా ఉన్నత పాఠశాలలో బాలికలపై ప్రధానోపాధ్యాయుడు వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై మున్సిపల్ కమిషనర్ భావనను విచారణాధికారిగా నియమించారు. బుధవారం ఆమె స్థానిక స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో బాధిత బాలికలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థినులు, తల్లిదండ్రుల నుంచి వేర్వేరుగా వివరాలు నమోదు చేశారు. ఇటీవల ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై స్థానిక పెద్దల వద్ద జరిగిన పంచాయితీలో రాజీ కుదుర్చుకున్నట్లు సమాచారం. కొందరు తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ కమిషనర్‌తో విచారణ చేయించారు. బుధవారం రాత్రి వరకు స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఆమె విచారణ నిర్వహించారు. నివేదికను త్వరలో కలెక్టర్‌కు అందజేయనున్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తికి 12 ఏళ్ల జైలు

అన్నవరం, న్యూస్‌టుడే: మహిళపై అత్యాచారం కేసులో నిందితుడికి న్యాయమూర్తి 12 ఏళ్ల జైలు శిక్ష విధించారని అన్నవరం ఎస్సై వి.కిశోర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివీ.. శంఖవరం మండలం గొంది గ్రామానికి చెందిన మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి ఆ పెళ్లికి నిరాకరించడంతో అదే గ్రామానికి చెందిన జి.సతీష్‌పై గత ఏడాది అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై అజయ్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రాజమహేంద్రవరం 8వ అడిషనల్ జిల్లా సెషన్స్ న్యాయస్థానంలో వాదోపవాదనలు అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి 12 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి వై.బెన్నయ్య నాయుడు ఆదేశాలిచ్చారన్నారు.

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా - 25, 28, వంకాయలు - 40, 40, 60, బెండకాయలు - 22, పచ్చిమిర్చి - 30, 34, కాకరకాయ - 34, బీర - 32, 40, క్యాబేజీ - 30, క్యారెట్ - 32, దొండకాయలు - 20, 34, బంగాళా దుంపలు - 30, 36, ఉల్లి - 47, 57, గోరుచిక్కుళ్లు - 30, దోసకాయలు - 36, ఆనబకాయ - 35, 38, పొట్ల కాయ - 18, 20, అరటికాయ - 6, 7, చిక్కుళ్లు - 66, 120, చేమదుంపలు - 46, మునగకాడలు - 10, 12, బీట్‌రూట్ - 32, కీరదోస - 32, బీన్స్‌కాయలు - 64, అల్లం - 52, క్యాప్సికం - 64, బొబ్బర్లు - 54, చిలకడదుంపలు - 56, మామిడికాయ - 15, 20, నిమ్మకాయలు(డజన్) - 36, 54.

సినిమాలు

గాంధీనగర్,: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- చిక్లెట్, 35, సరిపోదా శనివారం, హైడ్ ఎన్ సీక్, మత్తు వదలరా 2, దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్- గొర్రె పురాణం, 35, సరిపోదా శనివారం, 100 కోట్లు, లక్ష్మీ- ట్రాన్స్‌ఫార్మర్స్ 1, సత్యగౌరి- గొర్రెపురాణం, తిరుమల - చిక్లెట్, సిఅండ్‌సీ 1- మత్తువదలరా 2, సీఅండ్‌సీ 2- బొమ్మరిల్లు, శ్రీప్రియ - 100కోట్లు (ఉ,సా), ఆయ్(మ,రా), పద్మప్రియ- సరిపోదా శనివారం, సూర్య1(వాకలపూడి) - గొర్రె పురాణం, సూర్య 2- సరిపోదా శనివారం, శ్రీశ్రీనివాసా(వేళంగి)- మత్తువదలరా 2.

మేమున్నాం.. మీకు తోడుగా

ఖాళీ స్థలంతో ఇబ్బందులు



సమస్య: కాకినాడ మధురానగర్ గోకులం వద్ద లక్ష్మీగణపతి వీధి 2వ మలుపు చివర ఖాళీ స్థలం ఉంది. అందులో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరిగాయి. పాములు, పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి. **-స్థానికులు, మధురానగర్**

సమాధానం: సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **-డా.పృథ్వీచరణ్, ఎంహెచ్ఓ, నగరపాలకసంస్థ**

చెత్త పేరుకుపోతోంది..



సమస్య: బర్మాకాలనీ 3-16ఎ-19/2 డోరు నంబరు వద్ద వర్షం వస్తే కాలువలో చెత్త పేరుకుపోతోంది. కాలువను ఆనుకుని స్తంభాలు అడ్డుగా ఉండటం వల్ల వ్యర్థాలతోపాటు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **-శ్రీరామ్, బర్మాకాలనీ**

సమాధానం: ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం **-సుదర్శన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నగరపాలకసంస్థ**

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: 91548 46719

3/11 ముగ్గురే మిగిలారు..

కాకినాడ నగరపాలక సంస్థలో ఏఈల కొరత

కాకినాడ నగర పాలక సంస్థలో వింత పరిస్థితి నెలకొంది. పైస్థాయిలో పర్యవేక్షించే ఈఈలు, డిప్యూటీ ఈఈలున్నా.. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఏఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పర్యవేక్షణ, అంచనాల రూపకల్పన, బిల్లుల తయారీలో వీరిది కీలక పాత్ర. ఒకే సారి అయిదుగురు ఏఈలను బదిలీ చేయగా.. వారి స్థానంలో ఇద్దరిని మాత్రమే నియమించారు.

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్



కాకినాడ నగరపాలక సంస్థ

వాటర్‌వర్క్స్ పర్యవేక్షణ ఎలా..?

కీలకమైన వాటర్‌వర్క్స్ పర్యవేక్షణకు ఎవరినీ నియమించ లేదు. రానున్న వేసవిలో నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించే ఏఈ పోస్టులను భర్తీ చేయలేదు. రానున్న రోజుల్లో కాకినాడ నగరంలో పెద్ద ఎత్తున ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసే పనిలో ఏఈల పాత్ర కీలకం. ఇక్కడనున్న ఏఈ పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయలేదు కదా.. ఉన్న వారిని బదిలీ చేశారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు అప్రమత్తం కాకపోతే రానున్న రోజుల్లో నగరంలో అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గతంలో 11.. ఇటీవల 6.. నేడు 3

నగరపాలక సంస్థలో 11 ఏఈ పోస్టులు ఉండగా, ఇన్నాళ్లు ఆరుగురితో నెట్టుకొచ్చారు. వీరిలో ఒకరికి బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. మిగతా అయిదుగురిని ఇతర ప్రాంతాల్లో నియమించారు. కొత్తగా ఇద్దరు ఇక్కకు వస్తున్నారు. వీరిలో ఒకరు ఎలక్ట్రికల్, మరొకరు సివిల్ పనులు నిర్వహించనున్నారు.

బదిలీలు ఇలా..

తాజా బదిలీల నుంచి ఏఈ కె.కల్యాణిని మినహాయించారు. ఏఈలు వై.నాగేశ్వరరావు, పి.సూర్యకుమారిని విజయవాడకు, వి.ఉమామహేశ్వరిను పిఠాపురం, ఎం.రమేశ్‌బాబును సామర్లకోట, ఎస్.సాంబశివరావును ఏలూరు బదిలీ చేశారు. ఇక్కడ రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ నుంచి కె.దేవిలలిత కుమారి, ఏలూరు నుంచి కె.శేషగిరిరావును ఏఈలుగా నియమించారు.

పూర్తిస్థాయి ఎస్ఈ ఎవరు..?

నగరపాలక సంస్థ పర్యవేక్షక ఇంజినీరు(ఎస్ఈ) పి.సత్యకుమారిని బదిలీ చేసినా, ఆమె స్థానంలో ఇక్కడ ఎవరిని నియమించ లేదు. కార్యనిర్వాహక ఇంజినీరు(ఈఈ)కు పూర్తి అదనపు బాధ్యతలతో ఎస్ఈ పోస్టు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది. పూర్తిస్థాయి ఎస్ఈని నియమించకపోతే ఇబ్బందే.

ఈఈలు, డీఈఈలు..

ఇక్కడి నుంచి ముగ్గురు ఈఈలను బదిలీ చేసి, వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. డీఈఈ పోస్టులు ఆరు ఉండగా, ఇన్నాళ్లు అయిదుగురే పనిచేశారు. వీరిలో ఒకరు ఈనెలాఖరుకు స్వచ్ఛంద పదవీ విరమణ చేయనున్నారు. మిగతా నలుగురిని బదిలీ చేశారు. ఎస్.ప్రభాకరరావు, కె.శ్రీనివాస్‌ను విజయవాడ, కె.లోవరాజును రాజమహేంద్రవరం, కె.వెంకట్రావును నూజివీడు బదిలీ చేశారు. విజయవాడ నుంచి ఎన్.ఫణీంద్రకుమార్, బి.గురునాథబాబు, నూజివీడు నుంచి డి.లక్ష్మీనారాయణ, పెద్దాపురం నుంచి కేవీఎంఎం ఆదినారాయణను ఇక్కడ నియమించారు.

రేపు ఉద్యోగ మేళా

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగర నియోజకవర్గం ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో ఈ నెల 27న జగన్నాథపురంలో మహిళా కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, బీఎస్సీ, ఎమ్మెస్సీ(మైక్రోబయోలజీ), బీఎఫ్ఎస్ఎస్ ఆక్వాకల్చర్ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని కోరారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఐసీడీఎస్ పరిధిలోని బాలల పరిరక్షణ విభాగం(ఐసీపీఎస్)లో సోషల్ వర్కర్‌గా పనిచేస్తున్న యువతి జిల్లా బాలల పరిరక్షణ అధికారి(డీసీపీఓ)పై చేసిన ఆరోపణలపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు పీడీ కె.ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. డీసీపీవో వెంకట్రావు తనను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆ యువతి ఫిర్యాదు చేయగా.. ఆమె సక్రమంగా విధులు నిర్వహించడం లేదని డీసీపీవో ఫిర్యాదు చేశారన్నారు. ఏకపక్షంగా వ్యవహరించామని ఆమె చేస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పీడీ పేర్కొన్నారు.

టౌన్ రైల్వేస్టేషన్ తనిఖీ



గూడ్స్ షెడ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న పీసీసీఎం పద్మజ

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కె.పద్మజ కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్, గూడ్స్ షెడ్‌ను బుధవారం తనిఖీ చేశారు. లోడింగ్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాకినాడ సీ పోర్టు, కోరమండల్, నాగార్జున ఫెర్టిలైజర్స్, ఇతర పరిశ్రమల ఇన్‌ఛార్జులు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి సూచించారు. ముందుగా టౌన్ స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, బుకింగ్ కార్యాలయం, పార్సిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు వావిలపల్లి తదితరులు పాల్గొన్నారు.

బయో మెథనేషన్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు



పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలో బయో మెథనేషన్ ప్లాంటు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ భావన తెలిపారు. బుధవారం స్థానిక స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో ఎనర్గాన్ లాజిస్టిక్స్ సంస్థ ప్రతినిధులు, నగరపాలక అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. తడి చెత్త నుంచి కంప్రెస్డ్ బయో గ్యాస్ ఉత్పత్తి చేయడమే ఈ ప్లాంటు లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు. పీపీపీ విధానంలో రూ.20 కోట్లతో దీన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్లాంటు ఏర్పాటుతో పాటు నిర్వహణ బాధ్యతను ఎనర్గాన్ లాజిస్టిక్ సంస్థ తీసుకుంటుందన్నారు. స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకట్రావు, ఎంహెచ్‌వో డి.పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోనేరు ప్రక్షాళనకు చర్యలు చేపట్టాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని బాలాత్రిపుర సుందరి ఆలయం ఎదురుగా ఉన్న కోనేటిని ప్రక్షాళన చేసేందుకు నగరపాలక, దేవాదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని దూసర్లపూడి రమణరాజు కోరారు. బుధవారం ఆయన కోనేటి పరిసరాలను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా విగ్రహాలను ఇష్టానుసారంగా గాలికి వదిలేయకుండా నీడ కల్పించడంతో పాటు పూజలు నిర్వహించేలా చూడాలని కోరారు. నైరుతిలోని ప్రతిష్ఠించిన శివలింగం అపహరణకు గురైందని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు.

పోషకాహారం తీసుకోవాలి



గర్భిణులకు సీమంతాలు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తెదేపా నాయకురాలు, 12వ వార్డు ఇన్‌ఛార్జి తుమ్మల సునీత సూచించారు. దుమ్ములపేట ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో నూకాలమ్మ మాన్యంలోని కమిటీ హాలులో బుధవారం పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ దయామణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పోషకాహార లోపం వల్ల కలిగే నష్టాలను వివరించారు. 15 మంది గర్భిణులకు సీమంతాలు, 6 నెలల నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌కేలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం మెరుగులో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



వేడుకలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ అన్నారు. జేఎన్‌టీయూకేలో బుధవారం ఐఎస్‌టీలోని స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, టెక్నాలజీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఫార్మాసిస్టుల దినోత్సవం నిర్వహించారు. ఓఎస్‌డీ డి.కోటేశ్వరరావు, ఫార్మసీ కోర్సుల స్పెషలాఫీసర్ కె.పద్మప్రియ, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్, రాజమహేంద్రవరం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.నాగమణి పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యుడు డా.భీమశంకర్

మసీదుసెంటర్ (కాకినాడ): ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా పోలీసు అధికారులకు స్థానిక మెడికవర్ ఆసుపత్రి వైద్యులు బుధవారం అవగాహన కల్పించారు. డా.భీమశంకర్ మాట్లాడుతూ ఊపిరితిత్తుల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఏటా సెప్టెంబరు 25న ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఇంట్లో ఫ్రిజ్ పేలి జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్ర గాయాలతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కుటుంబానికి శ్రీయువసేన అధ్యక్షుడు బొళ్లం సతీష్ రూ.25 వేలు అందజేశారు. డెయిరీఫారం సెంటర్ ప్రాంతానికి చెందిన చంద్రకళ, ఆమె 11 ఏళ్ల కుమార్తె ఐశ్వర్య ఈ నెల 11న ఇంట్లో పూజ చేసుకుంటున్న సమయంలో ఫ్రిజ్ గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. ఇద్దరికీ గాయాలయ్యాయి. యానాంకు చెందిన కనకాల రాజు, బిస్ట్రాంగ్ జిమ్ సంకీర్తరాజు, పవన్ అందించిన మొత్తాన్ని బాధితులకు సతీష్ అందజేశారు.

భోజన వితరణకు ముందుకు రావాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్ల ద్వారా భోజన వితరణకు దాతలు ముందుకు రావాలని తెదేపా బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ హోతా రవి కోరారు. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఘాటీ సెంటర్ అన్న క్యాంటీన్‌లో బుధవారం మధ్యాహ్నం 400 మందికి రవి అన్నదానం చేశారు. తెదేపా నాయకులు మేడిశెట్టి చిన్ని, బుజ్జి, బండి గబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపుపై చేతులెత్తేశారా..?

నగరంలో సమస్య తీవ్రం

నగరపాలక సంస్థ పరిధిలో నెలరోజులుగా చెత్త తరలింపు నిలిచిపోయింది. ఇంటింటా చెత్త సేకరణ వాహనాలు ఆగిపోయాయి. కాంపెక్టర్లు, పుష్‌కార్టులు మరమ్మతులకు గురయ్యాయి. ఇళ్లు, వీధుల్లోని చెత్తను తరలించేందుకు పారిశుద్ధ్య కార్మికులు నరకయాతన పడుతున్నారు. ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదు. 12వ సర్కిల్ పరిధిలోకి వచ్చే 38, 39, 41, 42, 43 డివిజన్లలో పరిస్థితి మరీ దయనీయంగా ఉంది.

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్



మరమ్మతులకు గురై ఆగిపోయిన వాహనం



గాంధీనగర్‌లో పాడైన పుష్‌కార్టులు

వాహనాలు మరమ్మతులకు గురై..

బుధవారం జోరు వానలో స్థానిక వెంకటనారాయణ వీధిలో కాంపాక్టర్ మరమ్మతులకు గురై ఆగిపోయింది. దీంతో కార్మికులు చెత్త సేకరణ చేయలేకపోయారు. నగరపాలక సంస్థకు 15 కాంపెక్టర్ల వాహనాలు ఉండగా, ఇప్పటికే నాలుగు మరమ్మతులకు గురై వాహనవార్డుకు చేరాయి. పదుల సంఖ్యలో పుష్‌కార్టులు మూలకు చేరాయి. అపార్ట్‌మెంట్లలో పరిస్థితి దారుణంగా ఉంది. అయిదారు రోజులు చెత్త సెల్లార్లలో నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. వీధుల్లో ఏర్పాటు చేసిన డంపరు బిన్స్ నిండిపోవడంతో చెత్త ఇళ్లకే పరిమితం అవుతోంది. ఇంటింటా వాహనాలు అందుబాటులో లేకపోయినా.. ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించడం లేదు. ఈ వాహనాలు లేకముందు ట్రాన్స్‌ఫర్ పాయింట్ల వద్దకు చెత్తను తరలించేవారు. అక్కడ విభజించి డంపింగ్‌యార్డుకు పంపించేవారు. ఈ విధానం అమలుకు తక్కువ ఖర్చు అవుతుందని ఆ విభాగం అధికారులు చెబుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. నెలరోజులుగా చెత్తతో నరకయాతన అనుభవిస్తున్నా.. నగరపాలిక ఉన్నతాధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

కలెక్టర్‌ను కలిసి స్పెషల్ తహసీల్దారు ఠాగూర్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బదిలీల్లో భాగంగా కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో స్పెషల్ తహసీల్దారుగా నియమితులైన జీఆర్ ఠాగూర్ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్ మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండల తహసీల్దారుగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడకు బదిలీ చేశారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలో అక్రమ కట్టడాలు, చట్టానికి వ్యతిరేకంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని సిటిజన్ ఇన్సియేటివ్ కార్యదర్శి దువ్వూరి సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎలాంటి వివక్ష చూపకుండా అక్రమ నిర్మాణాలు అన్నింటిని మున్సిపల్ అధికారులు తొలగించాలని కోరారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పుడు మౌనంగా ఉన్న అధికారులపైనా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నగరంలో అక్రమంగా నిర్మించిన దుకాణాలను తొలగించాలని ప్రత్యేక అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

ముగిసిన సీఐఎస్‌పీ వర్క్‌షాప్

మసీదు సెంటర్ (కాకినాడ): వైద్యవిద్యార్థులకు సరైన రీతిలో బోధన చేసి సమాజానికి ఉపయోగపడే వైద్యులుగా తీర్చిదిద్దాలని ప్రొఫెసర్ డా.దేవీమాధవి అన్నారు. కాకినాడ ఆర్ఎంసీ వైద్య కళాశాల్లోని డిజిటల్ లైబ్రరీలో డీఎంఈ డా.నరసింహం సూచనల మేరకు కళాశాల మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ విభాగాధిపతి డా.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ నెల 24న ప్రారంభమైన కరికలమ్ ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ ప్రోగ్రాం(సీఐఎస్‌పీ) వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. ఆర్ఎంసీ వైస్‌ప్రిన్సిపల్(అకడమిక్) ప్రొఫెసర్ ఆఫ్ అనాటమీ డా.శశి, వైస్‌ప్రిన్సిపల్ డా. ఎ.విష్ణువర్ధన్, 30 మంది వైద్యనిపుణులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

మసీదు సెంటర్: కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో ఈట్ స్ట్రీట్ వ్యాపారుల ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని అన్నప్రసాద వితరణ చేశారు. జేఎన్‌టీయూకే మైదానం పక్కన పలు చోట్ల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఉప్పాడ థియేటర్‌లో టిక్కెట్ల వివాదం

కొత్తపల్లి: జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల సందర్భంగా ఉప్పాడలో ఓం శ్రీనివాస సినిమా థియేటర్ వద్ద అభిమానులు గందరగోళం సృష్టించారు. బెనిఫిట్ షో టిక్కెట్లు ముందుగానే విక్రయించడంతో.. వాటి కోసం థియేటర్ వద్దకు వచ్చిన అభిమానులకు లేవని చెప్పడంతో వివాదం ఏర్పడింది. తమకు బెనిఫిట్ షో టిక్కెట్లు కావాలని అభిమానులు మొండిపట్టు పట్టారు. సమాచారం తెలుసుకున్న కొత్తపల్లి పోలీసులు సినిమా థియేటర్ వద్దకు చేరుకుని అభిమానులతో మాట్లాడి నియంత్రించారు.

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా చైతన్య మురళి

మసీదుసెంటర్(కాకినాడ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా వై.చైతన్య మురళిని నియమించారు. ఆయన ఇప్పటి వరకు వెయిటింగ్‌లో ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: సముద్రం నుంచి బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. కాకినాడ పోర్టు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కేఎస్‌పీఎల్ పోర్టు ఒకటో బెర్త్ దగ్గర 40-50 ఏళ్ల వయసు ఉన్న పురుషుడి మృతదేహం కనిపించింది. 5 నుంచి 6 రోజుల క్రితం సముద్రంలో పడి ఉండొచ్చని చెప్పారు. ముఖం గుర్తు పట్టని విధంగా మారింది. మృతదేహంతో పాటు వినాయక విగ్రహం తొండం ఉంది. ఎక్కడైనా వినాయక నిమజ్జనంలో పడిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. అతడి వివరాలు తెలిసినవారు పోర్టు సీఐ నంబరు 9440796543, స్టేషన్ నంబరు 0884-2378711లో సంప్రదించాలన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

కైకలూరు: చోరీ కేసులో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ కైకలూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.శివకిరణ్ బుధవారం తీర్పును వెలువరించినట్లు పట్టణ సీఐ పి.కృష్ణ తెలిపారు. 2022 నవంబరులో ఏలూరు జిల్లా కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లోని ఓ తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి బంగారం, నగదు అపహరించారు. దీనిపై కేసు నమోదు చేసిన అప్పటి సీఐ ఏలూరుకు చెందిన అత్తోటి జాన్‌పాల్, గౌతు శేషు, కాకినాడకు చెందిన కొఠారు వాసును అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరు పరిచి ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై పోలీసులు బుధవారం సాక్ష్యులను ప్రవేశపెట్టి న్యాయవాది ద్వారా వాదనలు వినిపించారు. ఏలూరుకు చెందిన అత్తోటి జాన్‌పాల్, గౌతు శేషు వద్ద చోరీ చేసిన సొత్తు ఉందని నేరం రుజువైంది. ఈక్రమంలో న్యాయమూర్తి జాన్‌పాల్‌కు 97 రోజులు, గౌతు శేషుకు 142 రోజులు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. మరో వ్యక్తి కొఠారు వాసుపై ఎటువంటి నేరం రుజువు కానందున నిర్దోషిగా ప్రకటిస్తూ విడుదల చేశారు.

మళ్లీ ముంచెత్తింది..



కొత్తకాకినాడ కూడలి ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీటిలో రాకపోకలు సాగిస్తూ



శాంతినగర్ ప్రధాన రహదారిపై..

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: నగరంలో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు, రహదారులపై నీరు చేరింది. కొత్తకాకినాడ, చినమార్కెట్, గాంధీబొమ్మ సెంటర్, శాంతినగర్, బాలాజీచెరువు తదితర ప్రాంతాల్లోని రహదారులు వర్షపునీటితో నిండాయి. మోకాల్లోతు నీళ్లలో రాకపోకలు సాగించే క్రమంలో పలు ద్విచక్రవాహనాలు మొరాయించాయి. వర్షంలోనే తడుస్తూ విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగించారు. మురుగు రోడ్లపై పారింది.

ఉద్యోగి అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: జలవనరుల శాఖలో ఉద్యోగి అయిన మరిది (చెల్లెలు భర్త) తమ ఇంటికి వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించారని ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణ పరిధి సత్యవతినగర్‌లో సంధ్యాదేవి కుటుంబం నివసిస్తోంది. ఆమె చెల్లెలు వనజ భర్త అయిన సాధనాల కొండలరావు జలవనరుల శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కొంతకాలం క్రితం వారు విడిపోగా వనజ పిల్లలతో కాకినాడలో ఉంటున్నారు. ఈనెల 19న సాయంత్రం కొండలరావు కొవ్వూరులోని సంధ్యాదేవి ఇంటికి వచ్చి అసభ్యకరంగా మాట్లాడి చాకుతో పొడుస్తానని బెదిరించి, రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. భయపడి రూ.5 వేలు ఇవ్వగా ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపుతానని బెదిరించారు. ఈ ఘటనపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ సిబ్బంది భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకులు, మినీ కేంద్రాల కార్యకర్తల ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అర్బన్ శిశు అభివృద్ధి పథక అధికారిణి ఎ.జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ కేటగిరీ ప్రాతిపదికన ఈ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వివాహితులైన మహిళా అభ్యర్థినులు అర్హులని తెలిపారు. వయసు 21 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలన్నారు. దరఖాస్తులను అక్టోబరు 5 సాయంత్రం 5లోగా కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

పెద్దాపురం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి.. గడువు అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య పేర్కొన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో 43 మండలాల్లోని 45 కేంద్రాల్లో ఈ ప్రవేశపరీక్ష జనవరి 18, 2025న నిర్వహిస్తామన్నారు. తమ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

రహదారి బాగుకు శ్రమదానం



గాంధీనగర్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు సెంటర్‌లో రహదారి అధ్వానంగా మారింది. అక్కడి గుంతల్లో పడి పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు ఈ విషయాన్ని గమనించారు. భవన నిర్మాణ వ్యర్థాలతో వెళ్తున్న లారీని ఆపి గుంతల్లో ఇటుకలు, కంకర వేయించారు. వాహన చోదకులతో కలిసి ఆయన వాటిని గుంతల్లో వేసి సరిచేశారు. ఆయన చొరవను పలువురు అభినందించారు.

బాలు కీర్తి అజరామరం



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ, కళావేదిక సభ్యులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎప్పటికీ అందరి మధ్య నిలిచి ఉంటారని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డోకుబుర్ర రామరాజు అన్నారు. బుధవారం దంటు కళాక్షేత్రంలో కళావేదిక ఆధ్వర్యంలో బాలు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వేదిక కోశాధికారి సాల్మన్‌రాజు, సభ్యులు తిరుమలరావు, ఆకుల శ్రీనివాసు, రామారావు, బద్రీ, ప్రసాద్‌రెడ్డి, మహేశ్వరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు - ట్రాక్టర్ ఢీ

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం - రాజమహేంద్రవరం ఏడీబీ రహదారి ఏపీఎస్పీ పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు, పౌల్ట్రీకి చెందిన ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సు కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వెళుతుండగా, ప్రైవేటు పౌల్ట్రీకి చెందిన ట్రాక్టర్ రాజమహేంద్రవరం వైపు నుంచి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఏం కాలేదు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఘటన ప్రాంతానికి పెద్దాపురం ఎస్సై మౌనిక, సిబ్బంది వెళ్లి క్రమబద్ధీకరించారు.

భీమేశ్వరాలయంలో అన్నదానానికి విరాళం

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన రావుల పాండురంగేశ్వర్, హిమబిందు దంపతులు బుధవారం రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు.

'జయలక్ష్మీ బ్యాంకు బాధితులను ఆదుకోవాలి'

పిఠాపురం: జయలక్ష్మీ బ్యాంకు బాధితులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘ నియోజకవర్గ కన్వీనర్ యనమండ్ర సూర్యనారాయణ కోరారు. స్థానిక స్వర్ణపేటలోని తన నివాసంలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. వేలమంది నష్టపోయారని, ఆ సొమ్మంతా తిరిగి చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. 27న కాకినాడలో జరిగే సమావేశానికి హాజరు కావాలన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

పెద్దాపురం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి.. గడువు అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య పేర్కొన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 43 మండలాల్లోని 45 కేంద్రాల్లో ఈ ప్రవేశపరీక్ష జనవరి 18, 2025న నిర్వహిస్తామన్నారు. తమ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన సహాయ కమిషనర్

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మరిడమ్మ దేవాలయానికి సహాయ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.విజయలక్ష్మి బుధవారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను మర్యాదపూర్వకంగా కలిశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పిచ్చి మొక్కలతో సమస్య

సమస్య: స్థానిక రామారావుపేట, వరహాలయ్యపేటలో ప్రధాన రహదారిని ఆనుకొని పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. చాలా ఇబ్బంది పడుతున్నాం. వాటిని తొలగించడానికి పురపాలక సంఘ అధికారులు చర్యలు తీసుకోవాలి. – ఆనంద్, పెద్దాపురం

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి తొలగిస్తాం. – కేవీ పద్మావతి, కమిషనర్, పెద్దాపురం

– న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: కొత్తపల్లిలో ముత్యాలమ్మ గుడి నుంచి పొలాలకు వెళ్లే రహదారిలో చెత్త విపరీతంగా పెరిగిపోయి రాకపోకలు సాగించలేకపోతున్నాం. – రైతులు, కొత్తపల్లి

సమాధానం: తక్షణమే సంబంధిత పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీచేసి పేరుకుపోయిన చెత్తను తొలగిస్తాం. – వెంకటనారాయణ, ఎంపీడీవో కొత్తపల్లి

– న్యూస్‌టుడే, కొత్తపల్లి

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544


పన్నులు చెల్లించని ఇళ్లు 500 | కొళాయిలు లేని కుటుంబాలు 7800

న్యూస్‌టుడే, పిఠాపురం

అనుమతులు తీసుకొని కొందరు.. అనుమతుల్లేకుండా మరికొందరూ ఇళ్లు నిర్మించేశారు. పురపాలక సంఘానికి ఇంటి యజమానులు పన్ను చెల్లించడం లేదు. మరోవైపు కొళాయిలు లేకున్నా పన్నులు విధించిన ఇళ్లు కొన్ని అయితే, కొళాయిలు లేని ఇళ్లు పిఠాపురంలో వేలల్లో ఉన్నట్లు గుర్తించారు. ఇటీవల సచివాలయ సిబ్బంది నిర్వహించిన సర్వేలో ఈ నిజాలు బయటపడ్డాయి. పన్నులు ఎగ్గొట్టేస్తున్న వారిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

అధికారులా మజాకా..

పిఠాపురం పురపాలక సంఘంలో 30 వార్డులున్నాయి. 15 సచివాలయాల పరిధిలో 14,800 ఇళ్లు ఉన్నాయి. వీటిలో ఎన్ని ఇళ్లకు పన్నులు విధించారు, పన్నులు వేయని ఇళ్లు ఎన్ని ఉన్నాయి, కొళాయిలు లేని ఇళ్ల గుర్తింపునకు ఇటీవల సర్వే నిర్వహించారు. దాంతో గత అధికారుల అవినీతి, అక్రమాలతో పాటు.. పన్ను ఎగవేతదారులను సైతం గుర్తించారు. అగ్రహారం, దత్తనగర్, మోహన్ నగర్, జగ్గయ్యచెరువు, పాదగయ కూడలి, వైఎస్సార్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో పట్టణ ప్రణాళిక విభాగం అనుమతుల్లేకుండా చాలా చోట్ల ఇళ్లు నిర్మించినట్లు తేల్చారు. మరోవైపు అగ్రహారం, జగ్గయ్యచెరువు ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు అందించగా ఇక్కడి వారు ఏళ్ల క్రితమే నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే, వీరికి కొళాయి కనెక్షన్లు లేవన్న విషయమూ సర్వేలో తేలింది. దీంతో పాటు, కొళాయిలు లేకున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పన్నులు విధించిన విషయమూ సర్వేలో తేటతెల్లమైంది.





ఇదీ లెక్క..

పట్టణంలోని 14,800 ఇళ్లకు ఏడాదికి ఆస్తి పన్ను రూ.6కోట్లు వస్తుంది. కాగా పన్నులు చెల్లించని ఇళ్లు 500 వరకూ ఉన్నాయి. ఒక్కో ఇంటికి రూ.2వేలు చొప్పున లెక్క వేసినా రూ.10లక్షల వరకూ ఏటా పన్నులు ఎగ్గొడుతున్నారన్నది అధికారుల మాట. అధికారులకు తెలిసీ చాలా ఇళ్లకు పన్నులు వేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే, 7,800 ఇళ్లకు మంచినీటి కొళాయిలు లేనట్లు గుర్తించారు. గతం నుంచి ఉచితంగా కొళాయిలు వేయాలనే నిబంధనలున్నప్పటికీ అధికారులు ఆదేశాలు అమలు చేయలేదు. మొత్తంగా సర్వే పుణ్యమా అని అధికారుల మాయాజాలం బహిర్గతమైంది. ఇక్కడ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

పన్నులు చెల్లించాల్సిందే..

ప్రజలంతా పురపాలక సంఘానికి ఇంటి, కొళాయి పన్నులు చెల్లించి అభివృద్ధికి తోడ్పాటును అందించాలి. 500 ఇళ్లకు యుద్ధప్రాతిపదికన పన్నులు విధించేందుకు చర్యలు చేపట్టాం. కొళాయిలు లేని 7,800 ఇళ్లకు అమృత్ పథకం-2 కింద మంచినీరు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందుకోసం రూ.32కోట్లు నిధులు మంజూరయ్యాయి. పన్నులు ఎగ్గొడుతున్న వారిపై చర్యలు చేపడతాం. – ఎన్.కనకారావు, కమిషనర్, పిఠాపురం పురపాలక సంఘం



అధికారులతో సమావేశంలో ప్రత్యేకాధికారిణి ప్రియంవద

లబ్ధిదారులంతా గృహనిర్మాణం చేపట్టాలి

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ప్రభుత్వపరంగా ఇళ్లస్థలాలు పొంది రుణాలు మంజూరైన లబ్ధిదారులంతా వెంటనే గృహ నిర్మాణ పనులు చేపట్టాలని, లేకుంటే భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వ ఆర్థికసాయం అందే అవకాశం లేదని గొల్లప్రోలు మండల ప్రత్యేకాధికారిణి, మెప్మా పీడీ ప్రియంవద అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, గృహనిర్మాణ సంస్థ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. చివరి దశలో గృహనిర్మాణం ఉన్న లబ్ధిదారులంతా అక్టోబరు నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలని చెప్పారు. పునాది దశలో ఉన్న, ప్రస్తుతం పనులు చేపట్టే గృహనిర్మాణాలు డిసెంబరు నెలాఖరులోగా పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. వివిధ దశల్లో పనుల్లో ఉన్న గృహాల గురించి అధికారులు వివరించారు. ఎంపీడీవో శర్మ, ఈవోపీఆర్డీ కుమార్, ఏపీవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం మండల విద్యాశాఖధికారిగా స్థానిక బీఎంఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.శ్యాంబాబును నియమిస్తూ ఆర్‌జేడీ నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో బుధవారం ఆయన విధుల్లో చేరారు. ప్రధానోపాధ్యాయులు పలువురు ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. నాడు-నేడు పనులు గురించి ఆరా తీసి, త్వరలో జరగబోయే పరీక్షలకు ఎలాంటి ఏర్పాట్లు చేయాలో సిబ్బందికి సూచించారు. కాగా ఇప్పటి వరకూ పని చేసిన ఎంఈవో ఆర్వీ ప్రసాద్‌ను ఆర్‌జేడీ సస్పెండ్ చేశారు.



శ్యాంబాబును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దళితులపై దాడులు అరికట్టాలి

పిఠాపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగాయని పీవీరావు మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు వేలంగి వెంకటేష్ అన్నారు. పిఠాపురంలోని చిన్నమాంబ పార్కులో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు రఘురామ కృష్ణరాజు, పంతం నానాజీలను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. మారెళ్ల సోమరాజు, కొంగు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడ థియేటర్‌లో టిక్కెట్ల వివాదం

కొత్తపల్లి, న్యూస్‌టుడే: జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల సందర్భంగా ఉప్పాడలో ఓం శ్రీనివాస సినిమా థియేటర్ వద్ద అభిమానులు గందరగోళం సృష్టించారు. బెనిఫిట్ షో టిక్కెట్లు ముందుగానే విక్రయించడంతో.. వాటి కోసం థియేటర్ వద్దకు వచ్చిన అభిమానులకు లేవని చెప్పడంతో వివాదం ఏర్పడింది. తమకు బెనిఫిట్ షో టిక్కెట్లు కావాలని అభిమానులు మొండిపట్టు పట్టారు. సమాచారం తెలుసుకున్న కొత్తపల్లి పోలీసులు సినిమా థియేటర్ వద్దకు చేరుకుని అభిమానులతో మాట్లాడి నియంత్రించారు.

దీనదయాళ్ ఉపాధ్యాయ సేవలు మరువలేనివి

కరప, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, సర్పవరం జంక్షన్: దేశభక్తి ఉన్నత భావాలు కలిగిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ మహోన్నత వ్యక్తి అని, ఆయన సేవలు మరువలేనివని మండల భాజపా అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ అన్నారు. దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా కరపమండలం నడకుదురులో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దాపురం పట్టణ భాజపా కార్యాలయంలో అల్లు ప్రసాద్, బిక్కిన విశ్వేశ్వరరావు... పిఠాపురంలో పసుపులేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గొల్లప్రోలులోని భాజపా పట్టణ కార్యాలయంలో చిట్టా మధు ఆధ్వర్యంలో, సామర్లకోటలో గౌరకపూడి చిన్నయ్యదొర నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. కాకినాడ గ్రామీణం సర్పవరం జంక్షన్‌లో పితాని లీలావతి, రంబాల వెంకటేశ్వరరావు, బొలిశెట్టి రామకృష్ణ తదితరులు కార్యక్రమం చేపట్టారు.





సర్పవరం జంక్షన్, పిఠాపురంలో దీనదయాళ్‌కు నివాళి



పెద్దాపురంలో..

పెద్దాపురంలో ప్రాయశ్చిత్త దీక్ష

పెద్దాపురం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన అపవిత్రతకు నిరసనగా.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా.. పెద్దాపురం పట్టణం మెయిన్ రోడ్డు ఆంజనేయస్వామి గుడి వద్ద దీక్షలు చేపట్టారు. ముందుగా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) వేంకటేశ్వరస్వామి గుడిలో పూజలు నిర్వహించి దీక్ష చేపట్టారు. ఆయనకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాజాసూరిబాబురాజు, ఖండవిల్లి సూర్యనారాయణమూర్తి, రంధి సత్యనారాయణ తదితరులు సంఘీభావం తెలిపారు. దీక్షను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. పొలమరశెట్టి సత్తిబాబు, కటారి శ్రీను, లక్ష్మణ్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేస్తున్న ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

సామర్లకోట: అభివృద్ధే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం స్థానిక అన్నపూర్ణ కల్యాణ మండపంలో కమిషనర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం'లో ఆయన పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం

కరప, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. కరప మండలం వలసపాకలలో బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మితో కలిసి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. బుంగా సింహాద్రి, చాట్ల ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి

తాళ్లరేవు: మండలంలోని చొల్లంగిపేట, చొల్లంగి, జి.వేమవరం, కోరింగ, పెదబొడ్డు వెంకటాయపాలెం, చినబొడ్డువెంకటాయపాలెంలో బుధవారం ఇంటింటికీ కార్యకర్తలు తిరుగుతూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.



ప్రతిభ పరీక్షలకు 1,800 మంది హాజరు

గొల్లప్రోలు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గొల్లప్రోలు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చెకుముకి సైన్స్ సంబరాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 16 పాఠశాలల్లో జరిగిన ప్రతిభ పరీక్షలకు 1,800 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు మండలస్థాయిలో జరిగే జూనియర్, సీనియర్ విభాగాల్లో బృందాలుగా పాల్గొంటారని చెకుముకి కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు తెలిపారు.

ఇసుక కొరత పరిష్కరించేందుకు చర్యలు

గొల్లప్రోలు: ఇసుక సరఫరాలో నెలకొన్న ఇబ్బందులు పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ కార్మిక సంఘ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంలో ఆయన్ను సంఘ ప్రతినిధులు బుధవారం కలిసి ఇసుక కొరత గురించి వివరించగా.. ఈ మేరకు హామీ ఇచ్చారు.

వైద్యుల తర్వాత ఫార్మసిస్ట్‌లే కీలకం

సర్పవరం జంక్షన్: వైద్యవృత్తిలో వైద్యుల తర్వాత ఫార్మసిస్ట్‌లే కీలకమని కాకినాడ జీజీహెచ్ ఫార్మసీ విభాగం అధికారి బి.హర్షవర్ధనవర్మ తెలిపారు. రమణయ్యపేటలో బుధవారం అడబాల ట్రస్టు ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫార్మసిస్టులను సన్మానించారు. రత్నప్రసాదరావు పాల్గొన్నారు.

తాళ్లరేవు: ప్రపంచ వ్యాప్తంగా వైద్యరంగంలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడే అవగాహన కలిగి ఉండాలని వైద్య సేవల్లో ఫార్మసిస్ట్‌లదే కీలక పాత్ర అని వైద్యులు చిట్టూరి అశోక్ కుమార్ అన్నారు. కోరింగా కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో 4వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల ముగింపు సభ, ఫార్మసిస్ట్, ఎన్ఎస్ఎస్ దినోత్సవ కార్యక్రమాలు కళాశాల ప్రిన్సిపల్ సువర్ణ జ్యోతి అధ్యక్షతన బుధవారం జరిగాయి.

కుండపోత వర్షం.. రాకపోకలకు అంతరాయం

కరప, పెద్దాపురం, పిఠాపురం, తాళ్లరేవు, న్యూస్‌టుడే: కుండపోతగా కురిసిన వర్షానికి కరప మండలంలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోకి నీరు చేరగా, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లోకెల్లా గండేపల్లి మండలంలో అత్యధికంగా 53.2 మి.మీ.ల వర్షపాతం నమోదైందని పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు పేర్కొన్నారు. కోటనందూరులో 32.2, రౌతులపూడిలో 24.0, శంఖవరంలో 36.6, ఏలేశ్వరంలో 49.2, జగ్గంపేటలో 36.4, కిర్లంపూడిలో 26.4, ప్రత్తిపాడులో 28.4, తొండంగిలో 33.8, పెద్దాపురంలో 21.2, తునిలో 49.8 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు ఆయన తెలిపారు. వర్షానికి పిఠాపురంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తాళ్లరేవు మండలంలో అత్యధికంగా 160.4 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల ఏఎస్‌వో రమణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం గేటు వద్ద చెట్టు కూలింది.



కరప: ఎంపీడీఓ కార్యాలయం వద్ద వర్షపునీరు



తాళ్లరేవు: పరదేశమ్మపేటలో నీటమునిగిన రహదారి

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి చర్యలు

కరప: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి చర్యలు చేపడుతున్నామని కాకినాడ గ్రామీణ ప్రాజెక్టు సీడీపీవో వై.లక్ష్మి కోరారు. పెదకొత్తూరులో హెల్పర్ బీసీ-బి కేటగిరికి, సిరిపురంలో హెల్పర్ భర్తీకి ఓసీ (జనరల్) కేటగిరికి చెందినవారై ఉండాలన్నారు.

పెద్దాపురం: పెద్దాపురం పట్టణం 29వ వార్డులో వర్కరు, సామర్లకోట పట్టణం 17, 28 వార్డులో హెల్పర్ పోస్టులు, సామర్లకోట గ్రామీణం వీకే రాయపురంలో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని సీడీపీవో జి.ఉషా పేర్కొన్నారు.

పిఠాపురం: యు.కొత్తపల్లిలోని వాకతిప్ప-1 (బీసీ-ఏ), కొత్తపల్లిలోని రవీంద్రపురం-1 (ఓసీవీహెచ్), గొల్లప్రోలు మండలం దుర్గాడలోని కృష్ణాలయం వీధిలో-1 (ఓసీ) హెల్పర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు సీడీపీవో సీహెచ్ దుర్గాదేవి తెలిపారు.

పెదపూడి: మండలంలోని కైకవోలు ఎస్సీకాలనీ, పెదపూడి చాకలిపేట, జి.మామిడాడ శ్రీనివాసా థియేటర్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల సహాయకుల పోస్టులు భర్తీ చేస్తామని సీడీపీవో ఎ.జ్యోతి బుధవారం తెలిపారు.

సందడిగా వినాయక నిమజ్జనోత్సవం

గొల్లప్రోలు: చేబ్రోలులో ఆది వినాయకుని ఆలయం నుంచి నిమజ్జనోత్సవ ఊరేగింపు బుధవారం వైభవంగా నిర్వహించారు. 102వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. వివిధ రకాల పుష్పాలతో రథంలా అలంకరించిన ట్రాక్టరుపై వినాయక విగ్రహాన్ని ఉంచి ప్రదర్శన జరిపారు. దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



తొట్టె ఆటోలపై దేవతామూర్తుల వేషధారణలతో ప్రదర్శన

అపర్ణాదేవి ఆలయంలో శశికళ పూజలు

తాటిపర్తిలోని అపర్ణాదేవి ఆలయంలో హైదరాబాద్ చార్మినార్ ప్రాంతంలోని శ్రీభాగ్యలక్ష్మి ఆలయ ట్రస్టీ శశికళ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని కుంకుమపూజలు చేశారు. అపర్ణాదేవి ఆలయ విశిష్టతను వేద పండితులు ఆకొండి ప్రభాకరశాస్త్రి వివరించారు.

రుద్రుడికి ఆరుద్ర నక్షత్ర అభిషేకం

దుర్గాడ శివాలయంలో ఆరుద్ర నక్షత్ర పూజలు బుధవారం వైభవంగా నిర్వహించారు. అభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు ఏర్పాట్లు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం కోట గుమ్మం సెంటర్‌లోని ది పిఠాపురం అర్బన్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకు ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాలకవర్గం పదవీ కాలం ఆగస్టుతో పూర్తి కావడంతో కొత్త పాలకవర్గం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల అధికారిగా కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.దుర్గాప్రసాద్‌ను నియమించారు. పిఠాపురం పట్టణంతో పాటు, నరసింగపురం, మాధవపురం, నవఖండ్రవాడ, కుమారపురం, చిత్రాడ, శొంఠివారిపాకలు, కొండెవరం గ్రామాలకు చెందిన ఖాతాదారులు ఓటర్లుగా ఉన్నారు. 5 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. 27న ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. 28న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ, పోటీలో ఉన్న వారికి గుర్తుల కేటాయింపు జరుగుతుంది. వచ్చే నెల 6న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుంది. కాగా 7న అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నిక ఉంటుందని వివరించారు. పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఎన్నికలకు అన్ని పార్టీల నుంచి నాయకులు సిద్ధమవుతున్నారు. దాంతో ఇప్పటికే ఎన్నికల హడావుడి మొదలైంది.



పిఠాపురం అర్బన్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు

భూసారం పెంపునకు రైతులు ముందుకురావాలి

పెదపూడి, న్యూస్‌టుడే: అధిక దిగుబడులు సాధించాలంటే భూసారాన్ని పెంచాలని మండల వ్యవసాయాధికారి టి.వి.ఆర్.మణిదీప్ సూచించారు. పెదపూడి మండలం కైకవోలు, కుమారప్రియం గ్రామాల్లో రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

బాలలకు వాహనాలు ఇవ్వొద్దు

కాజులూరు, న్యూస్‌టుడే: మైనర్లకు వాహనాలు ఇస్తే వాటిని స్వాధీనం చేసుకుంటామని గొల్లపాలెం ఎస్సై ఎస్.తులసీరామ్ హెచ్చరించారు. బుధవారం గొల్లపాలెంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్సులు లేని వారికి వాహనాలు ఇవ్వొద్దన్నారు. బాలలకు వాహనాలు ఇచ్చిన యజమానులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ముంపునీటి సమస్యపై నిరసన

తాళ్లరేవు: సుంకరపాలెం కూడలిలో వర్షంనీరు రహదారిపై నిలిచిపోవడంపై స్థానికులు, వ్యాపారులు బుధవారం నిరసన తెలిపారు. యానాం నుంచి సుంకరపాలెం వచ్చే వాహనచోదకులు ముంపు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్‌లో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు పరిసరాల శుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో రైలు ప్రయాణికులకు అవగాహన కల్పించి కరపత్రాలను పంచారు. శ్రీనివాస్, మోషేడియన్, చైతన్య, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు - ట్రాక్టర్ ఢీ

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం - రాజమహేంద్రవరం ఏడీబీ రహదారి ఏపీఎస్పీ పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు, పౌల్ట్రీకి చెందిన ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సు కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వెళుతుండగా, ప్రైవేటు పౌల్ట్రీకి చెందిన ట్రాక్టర్ రాజమహేంద్రవరం వైపు నుంచి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఏం కాలేదు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఘటన ప్రాంతానికి పెద్దాపురం ఎస్సై మౌనిక, సిబ్బంది వెళ్లి క్రమబద్ధీకరించారు.



పెద్దాపురం ఏడీబీ రహదారిలో ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ఢీకొనడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

పని భారం తగ్గించాలని వినతి

ఏలేశ్వరం: తమపై పని భారాన్ని తప్పించాలని ఏలేశ్వరం గ్రామీణ మండలంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు. ఈ మేరకు వారు బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కి తమ సమస్యలు వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. పింఛన్లను ప్రతినెల ఠంచనుగా వేకువజామునే అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నామన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాల పంపిణీ, పాఠశాలల్లో మరుగుదొడ్ల చిత్రాలను అప్‌లోడ్ చేయడం నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి: నీలాద్రిరావుపేట శివారున ఉన్న కార్తికేయ ఆసుపత్రిలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డా. అవినాష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రి వార్షికోత్సవం దృష్ట్యా ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

చెకుముకి సైన్సు పరీక్షల నిర్వహణ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక (జవివే) ఆధ్వర్యంలో చెకుముకి సైన్సు పరీక్షలను బుధవారం జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో నిర్వహించినట్లు జవివే జిల్లా కన్వీనర్ యన్. కన్నబాబు తెలిపారు. సోమవరం జడ్పీ ఉన్నతపాఠశాలలో ఇతర ఉపాధ్యాయులతో కలిసి ప్రతిభా పరీక్షల పత్రాలను ఆయన బుధవారం విడుదల చేశారు. కిర్లంపూడి మండలంలో 7,8 తరగతులు జూనియర్ విభాగంగాను, 9,10 తరగతుల విద్యార్థులు సీనియర్ విభాగంగాను 8 పాఠశాలల్లో పరీక్షలు రాశారు. జూనియర్ విభాగంలో 603, సీనియర్ విభాగంలో 1033మంది పరీక్షల్లో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అక్టోబరు 1న మండల స్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హెచ్ఎం కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షెడ్డు కూల్చివేత



తుని, న్యూస్‌టుడే: శిథిలావస్థకు చేరిన షెడ్డు ప్రమాదకరంగా ఉందని జులై 28న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పాఠశాల కమిటీ సభ్యులు, కూటమి నాయకులు స్పందించారు. పట్టణంలోని ఎమ్మార్‌పేట స్పెషల్ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల భద్రత దృష్ట్యా బుధవారం జేసీబీ యంత్రంతో షెడ్డును నేలమట్టం చేయించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మార్కెట్ వీధి శుభ్రం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : నగర పంచాయతీ ఏలేశ్వరం మార్కెట్ సమీపాన పలు వీధులు అపరిశుభ్రంగా ఉన్నాయి. సమస్యను ఇన్‌ఛార్జి కమిషనర్ ఆర్. అనూష లక్ష్మి దృష్టికి కెళ్లగా ఆమె తక్షణం స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలిచ్చి చెత్త, కాయగూరల వ్యర్థాలను బుధవారం అక్కడ నుంచి తొలగించడంతో మార్కెట్ పరిసరాలు పరిశుభ్రమయ్యాయి.

నీటి వృథాకు అడ్డుకట్ట

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మన్యంవారి పాలెంలో పైపులైనుకు లీకులు ఏర్పడి తాగునీరు వృథాగా పోతుంది. దీంతో శివారు కాలనీకి నీటిసరఫరా లేకపోవడంతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. సమస్యను సర్పంచి పోట్రు వీర్రాజుకు సమస్యను వివరించగా పైపులైనుకు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

అవీ ఇవీ అన్నీ

ఉద్యోగమేళాలో 49 మంది ఎంపిక

రౌతులపూడి: రౌతులపూడిలో వికాస, శ్రీసూర్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ముఖాముఖికి 110 మంది హాజరయ్యారు. ఆరు కంపెనీల్లో ఉద్యోగాలకు 49 మందిని ఎంపిక చేశామని వికాస ప్రతినిధులు తెలిపారు.

సందడిగా నిమజ్జనం

తొండంగి: గాంధీబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జన కార్యక్రమం బుధవారం మదర్ థెరిసా యూత్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సందడిగా జరిగింది. యువత హాజరై నృత్యాలు వేస్తూ సందడి చేశారు. భక్తులు వినాయకుని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

శంఖవరం: కత్తిపూడి పాఠశాలలో రెండు రోజులు పాటు జరిగిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు బుధవారంతో ముగిశాయి. నాలుగు మండలాల నుంచి 600 మంది విద్యార్థుల్లో 120 మంది క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్రాజు తెలిపారు.

ఫార్మసిస్ట్ డే సందర్భంగా మందుల పంపిణీ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాలలో ఫార్మసిస్ట్ డే సందర్భంగా ఈలకొలను గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రశాంతి పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌కి నివాళి

ఏలేశ్వరం : ఏకాత్మత మానవతావాది దీన్‌దయాళ్ జయంతి కార్యక్రమం ఏలేశ్వరం భాజపా అధ్యక్షుడు రెడ్డి లోవరాజు ఆధ్వర్యంలో జరిగింది. దీన్ దయాళ్ చిత్రపటానికి లోవరాజు, గట్టెం వెంకటరమణ, ఆర్వీ కృష్ణారావు పూలమాల వేసి నివాళి అర్పించారు.

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి

శంఖవరం: రైతులు సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలని వ్యవసాయాధికారి గాంధీ అన్నారు. అచ్చంపేట, గౌవరంపేట గ్రామాల్లో బుధవారం 'పొలంబడి'లో పలు సూచనలు చేశారు. ఎలుకల నివారణకు ఎర మందును సామూహికంగా వాడాలన్నారు. ఎర మందును రైతులకు అందించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పత్తి, వరి, అరటి పంటలను పరిశీలించి చీడపీడలపై సూచనలు చేశారు.

జనవాణిలో అర్జీలు స్వీకరణ

ఏలేశ్వరం : ప్రజా సమస్యల పరిష్కారానికి తమ పార్టీ విశేష కృషి చేస్తోందని జనసేన ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల తమ్మయ్యబాబు అన్నారు. మంగళగిరి జనసేన కేంద్ర కార్యాలయంలో జనవాణి పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి బుధవారం ఇన్‌ఛార్జి తమ్మయ్యబాబు, పార్టీ కాకినాడ జిల్లా కార్యదర్శి పెంటకోట మోహన్, సంయుక్త కార్యదర్శి డి.శేషారావు తదితరులు తరలివెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి జనవాణిలో పోలవరం ఎమ్మెల్యే బాలరాజుతో కలిసి వినతులు స్వీకరించారు. వీటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సకాలంలో పరిష్కరిస్తామని వారు అన్నారు.

ఆత్మరక్షణ విద్యలో సివంగులు

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తాచాటుతూ..

ఆడపిల్లలు ఇంటి నుంచి అడుగు బయటపెట్టాలంటే అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. రోజూ ఏదో ఒక ప్రాంతంలో ఈవ్‌టీజింగ్, దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఆత్మవిశ్వాసంతో వాటిని ఎదుర్కోవడానికి అనేక మంది విద్యార్థినులు మార్షల్ ఆర్ట్స్ వైపు దృష్టి సారించడం అభినందనీయం. చదువుతోపాటు కరాటే, బాక్సింగ్, కుస్తీ, వ్యాయామం, సాహస క్రీడల్లో శిక్షణ పొందుతూ దూసుకెళుతున్నారు. పట్టణ పరిసరాల్లో ఉన్న పలు శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందుతూ సత్తా చాటి పతకాలు సాధిస్తూ శెభాష్ అంటూ ప్రశంసలు పొందుతున్నారు. పలువురు విద్యార్థినుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

- న్యూస్‌టుడే, తుని, తుని పట్టణం



యుద్ధవిద్యలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ఒలింపిక్స్‌లో రాణించాలని..



ఒలింపిక్స్ పోటీల్లోనూ మార్షల్ ఆర్ట్స్ ఉండటంతో దీనిలో రాణించాలని రోజూ సాధన చేస్తున్నా. శిక్షకుడు రమణ వద్ద సంవత్సరం నుంచి కరాటే నేర్చుకుంటున్నాను. గతేడాది రామచంద్రాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కటా జూనియర్స్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించాను. - **కె.లోచన, తుని**

ఉద్యోగ సాధనే లక్ష్యంగా..



మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభచూపితే ఆ ధ్రువీకరణ పత్రం ద్వారా ఉన్నత విద్య, పలు ఉద్యోగాల్లో ఉపయోగపడుతుందని తెలుసుకున్నా. దాంతో కరాటేలో తొలి మూడు నెలల్లో వైట్ బెల్ట్ సాధించా. మూడేళ్ల తర్వాత బ్లాక్ బెల్ట్ స్థాయికి చేరడమే లక్ష్యం.. మధ్యలో మరో 12 రకాల వివిధ రంగుల బెల్ట్‌లు ఉంటాయి. దీనికి అనుగుణంగా రోజూ శిక్షణ పొందుతున్నా. - **టి.చైత్ర మాహిక, తుని**

ఆడపిల్లలకు తప్పనిసరి..



ప్రస్తుత సమాజంలో ఎదురవుతున్న పలు సమస్యలను ధైర్యంగా తిప్పికొట్టడానికి ఆడపిల్లలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ఎంతో ముఖ్యమని తెలుసుకున్నా. దీంతో రోజూ పాఠశాలకు వెళుతూనే పౌష్టికాహారం తీసుకుంటూ, కొంత సమయం కరాటే నేర్చుకోవడానికి కేటాయిస్తున్నా. ఆత్మవిశ్వాసం పెంచుకుంటూ అటు చదువు, ఇటూ ఆటలోనూ రాణిస్తున్నా.. - **కె.యశస్విని, తుని**



కొత్తూరు చెరువు గట్టుపై నుంచి పారుతున్న నీరు

వీడని వాన

తొండంగి, న్యూస్‌టుడే: రెండు రోజుల నుంచి వర్షం కురుస్తూనే ఉంది. బుధవారం మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. తొండంగి శివారు వరి పొలాలు నీట మునిగాయి. ఎగువ నుంచి వరదనీరు రావడంతో కొత్తూరు చెరువు గట్టుపై నుంచి నీరు పొంగి ప్రవహించింది.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు ప్రణాళికలు

తుని గ్రామీణం: స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు 28లోగా ప్రణాళికలు సిద్ధం చేసేందుకు గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీవో రవికుమార్ సూచించారు. బుధవారం డి.పోలవరంలో గ్రామ సభ నిర్వహించి సమస్యలను గుర్తించారు.

కేంద్రాల్లో ఖాళీల భర్తీకి ప్రకటన

ప్రత్తిపాడు, శంఖవరం, తొండంగి, గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీకి ప్రకటన జారీ చేశారు. చింతలూరు-2 అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ), వేములపాలెం కేంద్రంలో అంగన్‌వాడీ సహాయకురాలు(ఓసీ), ఏలూరు-2 కేంద్రంలో సహాయకురాలు(ఎస్సీ) పోస్టులకు ఈనెల 25 నుంచి అక్టోబరు 5 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీవో ఆర్వీఎస్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత, 21-35 వయసు అర్హతలుగా పేర్కొన్నారు.

● పెదమల్లాపురం పంచాయతీ పరిధిలోని ఎరకాపురం అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీపీవో పద్మావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

● తొండంగి మండలంలో ఖాళీగా ఉన్న మూడు కేంద్రాల్లో సహాయక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో శ్రీలత తెలిపారు. పీఇఅగ్రహారం (ఓసీ), కృష్ణాపురం (బీసీ,ఎ మహిళ), పీఈచిన్నాయిపాలెం (ఎస్సీ) రిజర్వేషన్ ఉండి పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ● జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల ఖాళీలను భర్తీ చేయనున్నట్లు సీడీపీవో పూర్ణిమ తెలిపారు. రాజపూడి-2 కేంద్రం, జె.కొత్తూరు-2 కేంద్రం, గండేపల్లి మండలం యల్లమిల్లి-2 , కిర్లంపూడి మండలం జగపతినగరం-2 ఖాళీలను భర్తీ చేయనున్నారు.

లడ్డూ ప్రసాదం అపవిత్రం.. సర్వత్రా దీక్షలు

తుని, గండేపల్లి (జగ్గంపేట), న్యూస్‌టుడే: తితిదేలో మహాప్రసాదం లడ్డూ అపవిత్రం కావడంపై జనసేన పార్టీ నాయకులు దీక్ష చేపట్టారు. అధినేత పవన్ కల్యాణ్ ఇప్పటికే ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టడంతో ఆయనకు మద్దతుగా పార్టీ శ్రేణులు కొనసాగించారు. పాతబజారులో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు దీక్షల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. దీక్ష చేస్తున్న వారిని భాజపా నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. చోడిశెట్టి గణేష్, ప్రగడ చక్రరావు, వి. నాగేంద్ర, ఏ. బాలాజీ, జి.సురేష్, నవీన్, సీతారామరాజు పాల్గొన్నారు.

● గత ప్రభుత్వం తిరుపతి లడ్డును అపవిత్రం చేసి పాపాన్ని మూటగట్టుకున్నారని తెదేపా నాయకుడు వేములకొండ జోగారావు తెలిపారు. జగ్గంపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 108 కొబ్బరికాయలు కొట్టి ప్రాయశ్చిత పూజలు నిర్వహించారు.

● తిరుమల లడ్డూను అపవిత్రం చేయడం దారుణమని గండేపల్లి తెదేపా నాయకుడు కందుల చిట్టిబాబు అన్నారు. జడ్.రాగంపేటలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆయన ప్రాయశ్చిత దీక్ష చేపట్టారు. మరిడమ్మ ఆలయంలో నాయకులు కోర్పు లచ్చయ్యదొర, సుంకవల్లి రమేష్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు.



తునిలో ఆలయ ప్రాంగణం శుభ్రం చేస్తున్న జనసేన నాయకులు

గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: స్వామివారి లడ్డూ అపవిత్రత చేసిన జగన్ ప్రభుత్వంపై దర్యాప్తు చేపట్టాలని జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. బుధవారం జగ్గంపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో సంఘీభావ దీక్ష చేపట్టారు. 108 కొబ్బరికాయలు కొట్టిన అనంతరం లలితా పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.



సంఘీభావ దీక్షలో జనసేన నాయకుడు రమేష్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి: తిరుపతి లడ్డూ పవిత్రతను కాపాడాలని ప్రసాదాలను కల్తీ చేసిన దోషులను శిక్షించాలని జగ్గంపేటలో కూటమి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత మల్లిఖార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాట్రావులపల్లిలో 108 కొబ్బరికాయలు కొట్టి మోకాళ్లపై ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. నాయకులు ముసిరెడ్డి నాగేశ్వరరావు, యేలేటి బాబి, సుంకర సీతారామయ్య పాల్గొన్నారు.

● చిల్లంగిలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో తెదేపా నాయకుడు కాళ్ళ వెంకటేష్ దంపతులు స్వామివారికి పూజలు నిర్వహించారు. 108 కొబ్బరికాయలను పార్టీ నాయకులు కొట్టారు. బూరుగుపూడిలో అలివేలుమంగ, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాటంశెట్టి రవి దంపతులు పూజలుచేసి 108 కొబ్బరి కాయలు కొట్టారు. తామరాడ, వీరవరం, సోమవరం గ్రామాల్లోని ఆలయాల్లోను నాయకులు పూజలు చేశారు. నాయకులు చదరం చంటిబాబు, తోట రవి, గాంధీ, గుడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కాట్రావులపల్లిలో మోకాళ్లపై నిలబడి కూటమి నాయకుల పూజలు

సంక్షేమమే లక్ష్యంగా వంద రోజుల పాలన

రౌతులపూడి: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా ప్రజా వేదిక నిర్వహించారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, సర్పంచి అర్జమ్మ, ఎంపీటీసీ సభ్యుడు బీజా రాజు, నాయకులు పైలా సాంబశివరావు పాల్గొన్నారు.



కరపత్రాలను చూపుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, నాయకులు

తుని గ్రామీణం: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ప్రభుత్వ పాలనను గాడిలోపెట్టిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దివ్య కోరారు. కుమ్మరిలోవ, కొలిమేరు, ఎన్ఎస్వీ నగరం, కోటనందూరు మండలంలోని కేవో అగ్రహారం, కేపే మల్లవరం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీ బొప్పన రాము, నాయకులు గాడి రాజబాబు, యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్ చింతంనీడి అబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరిలోవలో 'ఇది మంచి ప్రభుత్వం' ర్యాలీలో ఎమ్మెల్యే దివ్య

గండేపల్లి: ప్రజాసంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని అది ఈ 100 రోజుల పాలనలో ప్రజలకు అర్థమయ్యిందని జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. బుధవారం సూరంపాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, కుంచే రాజా, పోసిన బాబు రావు, మారిశెట్టి భద్రం తదితరులు పాల్గొన్నారు.

సాగు ఖర్చులు ఆదా చేయాలి

ప్రత్తిపాడు: వాకపల్లి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' బుధవారం జరిగింది. వ్యవసాయాధికారి గంగాధర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కలిగించారు. పెట్టుబడులు తగ్గించుకోవడానికి ప్రకృతి సేద్యమే ప్రత్యామ్నాయమని సూచించారు. చీడపీడల నివారణకు వాడే కషాయాల తయారీపై అవగాహన కలిగించారు. సర్పంచి నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



వాకపల్లిలో కషాయం తయారు చేయిస్తున్న వ్యవసాయాధికారి గంగాధర్

రౌతులపూడి, గండేపల్లి,: శృంగవరంలో వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు, పశువైద్యాధికారి ముద్రగడ వీరరాఘవరావు, ఉద్యానశాఖాధికారి అరుణ్ కుమార్ 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా అందుతున్న సేవలు, సామూహిక ఎలుకల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. సర్పంచి పులి ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు గాది రాజుబాబు, తెదేపా నాయకులు వాసం సాంబశివరావు, లొండా దేవుళ్ల తదితరులు పాల్గొన్నారు. ● సూరంపాలెంలో 'పొలం పిలుస్తుంది' పోస్టర్ ను నాయకులు తుమ్మలపల్లి రమేష్, పోతుల మోహనరావు, కుంచే రాజా ఆవిష్కరించినట్లు వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి తెలిపారు.

తుని గ్రామీణం: రైతులకు కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిన పథకాలు, రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్ సూచించారు. అటికివానిపాలెం, మరువాడల్లో అధికారులు పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఉద్యానశాఖ అధికారిణి విజయలక్ష్మి మాట్లాడారు.

ఏలేశ్వరం : రైతులు సాగులో ఆధునిక విధానాలను అందిపుచ్చుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి బి. జ్యోతి అన్నారు. లింగంపర్తి, భద్రవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది జరిగింది. ఆమె మాట్లాడుతూ డ్రోన్ల వినియోగంతో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవచ్చునన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు.

ఒమ్మంగి సొసైటీ పూర్వ అధ్యక్షుడి మృతి



ప్రత్తిపాడు: ఒమ్మంగికి చెందిన భూస్వామి, దాత, **సుంకర తమ్మారావు** (88) గురువారం మృతి చెందారు. మూడు దఫాలు ఒమ్మంగి సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. సొసైటీ భవనానికి స్థలాన్ని దానం చేసి భవనాన్ని నిర్మించి ఇచ్చారు. గ్రామంలో శివాలయ నిర్మాణానికి విరాళం అందజేశారు. అనారోగ్యంతో మూడు రోజుల కిందట కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు.

పచ్చదనం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: పచ్చదనం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని లోవ దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా బుధవారం దేవస్థానం మెట్లమార్గంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తను శుభ్రం చేశారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సిబ్బంది, నాయీబ్రహ్మణులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారులు.

లోవ దేవస్థానంలో మొక్క నాటుతున్న డీసీ విశ్వనాథరాజు →



చికిత్స పొందుతూ ఇద్దరి..

మసీదుసెంటర్(కాకినాడ): ప్రత్తిపాడు మండలం బాపన్నధార గ్రామానికి చెందిన ఎల్.సింహాద్రి(17) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. గడ్డి మందు తాగిన ఘటనలో ప్రథమ చికిత్స అనంతరం ఈ నెల 24న జీజీహెచ్‌లో చేర్చారు.

మసీదుసెంటర్(కాకినాడ): తుని మండలం తాళ్లూరుకు చెందిన షేక్ మదీనావల్లి(32) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. పురుగుల మందు తాగిన ఘటనలో ప్రథమ చికిత్స అనంతరం ఈ నెల 23న జీజీహెచ్‌లో చేర్చారు.

ఘనంగా గురు వందనం

తుని పట్టణం, న్యూస్‌టుడే: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గురువందన్ ఛాత్రాభినందన్ కార్యక్రమం బుధవారం పట్టణంలోని జిల్లా ప్రజాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగింది. 2020 - 24 విద్యాసంవత్సరాల్లో 10వ తరగతిలో మొదటి స్థానంలో నిలిచిన 14 పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంయుక్తంగా ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. విద్యార్థులు గౌరవభావంతో తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు ఆచార్యులు, గౌరవ అధ్యక్షుడు మంతెన సూర్యనారాయణరాజు, డీఎల్ఎన్ ప్రసాద్, శివాజీ, ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు, తదితరులు

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

పెద్దాపురం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి. . గడువు అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య పేర్కొన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో 43 మండలాల్లోని 45 కేంద్రాల్లో ఈ ప్రవేశపరీక్ష జనవరి 18, 2025న నిర్వహిస్తామన్నారు. తమ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

ఏళ్లుగా సొసైటీ భవనాల దుస్థితి

నాడు ఘనం.. నేడు దైన్యం

కిర్లంపూడి, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఒకప్పుడు ఈ భవనాలు రైతుల సేవలో తరించాయి. రైతుల పరపతిని పెంచేందుకు ఈ భవనాలు ఎంతగానో దోహదపడ్డాయి. ఇప్పటికీ పలువురు రైతులు ఈ భవనాలను చూస్తూ వెళ్తున్నారంటే ఆ అనుబంధం అలాంటిది. సొసైటీల విలీనాలు తరువాత 15 ఏళ్లుగా అలంకారప్రాయంగా మారాయి. దీంతో వీటి నిర్వహణ లేక విలువైన భవనాలు నేడు శిథిలావస్థకు చేరాయి. మండలాల్లోని ప్రతి మూడు, నాలుగు గ్రామాలకు ఒక సొసైటీ భవనం ఉంది. వాటి విలీనం తరువాత మండలానికి కేవలం రెండు సొసైటీలు మాత్రమే కొనసాగుతున్నాయి. మిగిలిన భవనాలను దేనికీ వాడకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలను వీటిలో నిర్వహించుకునే వీలు ఉన్నప్పటికీ రూ. లక్షలు ఖర్చుచేసి గత ప్రభుత్వం గ్రామాల్లో ఆర్బీకేల నిర్మాణాలను చేపట్టింది. పోని అవైనా పూర్తి అయ్యాయా అంటే ఒకటి అర తప్ప మిగిలినవన్నీ నిర్మాణ దశలోనే ఉన్నాయి.



బూరుగుపూడిలో తుప్పలతో నిండిన భవనం

కిర్లంపూడి మండలంలో 21 గ్రామాలకు ఏడు సొసైటీ భవనాలు రైతుల సేవలో ఉండేవి. కిర్లంపూడిలో రెండు, రాజుపాలెం, వీరవరం, పాలెం, బూరుగుపూడి, గెద్దనాపల్లి గ్రామాల్లో సొసైటీ భవనాలు ఉన్నాయి. వీటిలో కిర్లంపూడి, వీరవరంలో ఉన్న సొసైటీల్లో మిగిలిన వాటిని విలీనం చేశారు. మిగిలిన ఐదు భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. అలాగే జగ్గంపేట మండలంలోను ఐదు భవనాలు, గండేపల్లిలో మూడు, గోకవరంలో నాలుగు భవనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇవన్నీ పూర్తిగా ప్రభుత్వానికే చెందినవి కావడంతో ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టదలచిన కార్యక్రమాలకు వీటిని వాడుకునే వీలుంది. ఇలాచేస్తే కనీస నిర్వహణ ఉండి భవనాలు పాడవకుండా ఉంటాయి. ప్రతి నియోజకవర్గంలో పది, పదిహేను సొసైటీ భవనాలు ఉన్నా కనీసం వీటిని ఆర్బీకేలకు అనుబంధంగా ఎరువుల గోదాంల్లా కూడా వాడడం లేదు. వీటిని అద్దెకు ఇచ్చినా సహకార శాఖకు డబ్బులు వచ్చేవి. కొన్ని భవనాలు ఊరిచివర ఉండడంతో గడ్డి, కట్టెలు, ఇతర సామగ్రి వాటిలో పడేస్తున్నారు. కొన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా సహకార శాఖ అధికారులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఈ భవనాలను అద్దెలకు ఇవ్వడం, ఇతర శాఖలకు బదిలీచేయడం వంటి చర్యలు తీసుకుంటే విలువైన భవనాలు ఉపయోగంలోకి వస్తాయి.

నియోజకవర్గానికి 10 నుంచి 15 వరకు..



మల్లిశాలలో నిరుపయోగంగా ఇలా..